APTEL/2008/28200

## గాంధీ ఒక బ్రోకర్ : పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్ : బ్రోకర్ వి నువ్వా నేనా. టిడిపిలో గెలిచి బాబును మోసం చేశావని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ లో గెలిచి కేసిఆర్ ను మోసం చేశావు. మిస్టర్ గాంధీ గుర్తు పెట్టుకో..సిఎం అవుతా అని చెప్పుకున్న ఈటెల ను బొంద పెట్టిన మొగొన్ని నేనని అన్నారు. నేను తెలంగాణ గడ్డ మీద పుట్టిన బిడ్డను. నీవు ఎక్కడ నుంచో వచ్చి నాకు సవాల్ చేస్తే ఊరుకుంటనా. శంబీపూర్ రాజు నేతృత్వంలో గాంధీ ఇంటికి వెళతాం. జిల్లా బిఆర్ఎస్ నేతలు కార్యకర్తలు అంతా రావాలని పిలుపునిస్తున్న. కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావు అనుమతితో చెబుతున్నా. నీకు నాకు ఏమైనా తగాదాలు ఉన్నాయా? నీకు నాకు ఏం పంచాయితీ. బీఆర్ఎస్ బి ఫామ్ మీద గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లడానికి సిగ్గు అనిపించడంలేదా . నువ్వు మొగొడివి ఐతే రాజీనామా చేసి మళ్లీ గెలువని అన్నారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం ?

హైదరాబాద్ : హైదరాబాద్ లోని హుజురాబాద్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద గురువారం వేకువ జాము నుండి తీవ్ర ఉత్కంఠ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులను ఆయన ఇంటి వద్ద మొహరించారు. ఆయనను గృహనిర్బంధం చేసినట్టుగా తెలుస్తోంది. ఏ క్షణమైనా ఆయనను అరెస్టు చేయవచ్చుని పోలీసు వర్గాల సమాచారం. ఇటీవల పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై నాలుగు వారాల్లో చర్య తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తాను పార్టీ మారలేదని బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని ప్రకటించిన విషయం తెలిసిందే. తాను గురువారం ఉదయం గాంధీ నివాసానికి వెళ్తానని ఆయన ఇంటిపై గులాబీ జెండా ఎగరవేసి అక్కడి నుండి తెలంగాణ భవన్ కి వచ్చి ప్రెస్ మీట్ పెడతానని కౌశిక్ బుధవారం సాయంత్రం ప్రకటించారు.

సంపుటి: 16 సంచిక : 117 కరీంనగర్ శుక్రవారం, సెప్టెంబరు 13, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం !



హైదరాబాద్ : తెలంగాణలో కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. పార్టీకి కొత్త సారధి రాకతో ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ పూర్తి చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారు. అధిష్టానం అనుమతికోసం ఆయన ఢిల్లీ వెళ్లారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలోనే ఉన్నారు. మొన్నటి వరకు జోడు పదవులతో బిజీబిజీగా ఉన్న రేవంత్ రెడ్డి.. టీపీసీసీ చీఫ్ గా మహేశ్ గౌడ్ ఎంపిక కావడంతో పార్టీ బాధ్యతల నుంచి రేవంత్ ఫ్రీ అయ్యారు. ఇప్పుడు సాధ్యమైనంత త్వరగా కేబినెట్ విస్తరణ పూర్తి చేయాలని పట్టుదలతో ఉన్నారు. కేబినెట్ విస్తరణకు సామాజిక కూర్పులో భాగంగా పీసీసీ చీఫ్ ఎవరు అవుతారన్నది ముడిపడి ఉండటంతో తర్జనభర్జన తరువాత బీసీ నేత మహేశ్ కుమార్ గౌడ్ కు హైకమాండ్ ఆమోదం తెలిపింది. దీంతో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో కలుపుకొని 11మందితో కేబినెట్ ఉంది. కొత్తగా కేబినెట్ లో చేరేందుకు మరో ఆరుగురికి ఛాన్స్ ఉంది. దీంతో ఎలాగైనా మంత్రిగా చోటుదక్కించుకోవాలని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కులాలు, జిల్లాలు, బలాలు ఇలా ఎవరికివారు లెక్కలు వేసుకొని రేవంత్ కేబినెట్ లో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం రేవంత్ కేబినెట్ లో హైదరాబాద్, అదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి ఎవరూ లేరు. ఈసారి ఈ జిల్లాల నేతలకు చాన్స్ ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి రేసులో ఉండగా ఒక్కరికే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్ సోదరులు, వెడ్మ బొజ్జు, ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ లో సుదర్శన్ రెడ్డికి దాదాపుగా బెర్త్ కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి దానం నాగేందర్ పేరు వినిపిస్తుండగా.. నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్ కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ఎవరికి అధిష్టానం కటాక్షం దక్కుతుందోనన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠను రేపుతోంది.

## సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి

# సీతారాం ఏచూరి కన్నుమూత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారు. శ్వాసకోశ సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆగస్ట్ 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్సం పొందుతున్నారు. వెంటిలేటర్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. చివరికి ఆయన పరిస్థితి విషమించడంతో సెప్టెంబర్ 12 గురువారం తుది శ్వాస విడిచారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సీతారాం ఏచూరి ఆగస్టు 19న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన 25 రోజులుగా చికిత్స పొందుతున్నారు. 72 ఏళ్ల ఏచూరి సీపీఎం నేతకు ఇటీవల క్యాటరాక్ట్ ఆపరేషన్ కూడా జరిగింది. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరి నేతృత్వంలో వైద్య బృందం ఆయనకు చికిత్స అందించింది. అయితే ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయకపోవడంతో జపాన్ నుంచి ప్రత్యేక మందులు కూడా తెప్పించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచారు. దీంతో కమ్యూనిస్ట్ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. అతను హైదరాబాద్‌లో పెరిగాడు. పదో తరగతి వరకు ఆల్ సెయింట్స్ హైస్కూల్లో చదివారు. 12వ పరీక్షలో దేశంలోనే ప్రథమ ర్యాంక్ సాధించారు. 1969 తెలంగాణ ఉద్యమం సమయంలో ఢిల్లీ చేరుకున్నారు. ఏచూరి ఢిల్లీలోని ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ హయ్యర్ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ వన్ సాధించారు. అతను ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో మొదటి ర్యాంక్‌తో ఎకనామిక్స్‌లో తన బిఎ (ఆనర్స్) పూర్తి చేశారు. ఆ తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) నుంచి ఆర్థికశాస్త్రంలో ఎంఏ చేశారు. పీహెచ్‌డీ కోసం జేఎన్‌యూలో అడ్మిషన్ తీసుకున్నారు. అయితే 1975లో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయినందున పూర్తి చేయలేకపోయారు. 1974లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)లో చేరిన ఏచూరి ఒక సంవత్సరం తరువాత అతను కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) లో చేరారు. 1975లో సిపిఎంలో చేరారు. వరుసగా మూడుసార్లు జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఎమర్జెన్సీ తర్వాత, అతను ఒక సంవత్సరంలో (1977-78) మూడుసార్లు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కేరళ, బెంగాల్ నుండి కాకుండా జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికైన మొదటి వ్యక్తిగా నిలిచారు. ఏచూరి 1984లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1986లో ఎస్ఎఫ్ఐ నుంచి వైదొలిగారు. ఆ తర్వాత 1992లో జరిగిన పద్నాలుగో జాతీయ సమావేశాల్లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఏచూరి జూలై 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 19 ఏప్రిల్ 2015న సీపీఐ(ఎం) ఐదవ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 2018లో మళ్లీ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 2022లో, ఏచూరి మూడోసారి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఏచూరి భార్య సీమా చిస్తీ వృత్తిరీత్యా జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అతని మొదటి వివాహం వీణా మజుందార్ కుమార్తె ఇంద్రాణి మజుందార్‌తో జరిగింది. ఈ వివాహంలో అతనికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏచూరి కుమారుడు ఆశిష్ ఏప్రిల్ 22, 2021న 34 ఏళ్ల వయసులో కారణంగా మరణించారు.

# ఇంకెంతకాలం కళ్లు మూసుకుని ఉంటారు?: బీజేపీపై రాహుల్ మండిపాటు



ఢిల్లీ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యాచార ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నా ఆ పార్టీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని లోక్ సభపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ట్రైనీ ఆర్మీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరవయ్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాలపట్ల బీజేపీ ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి ఆందోళన కలిగిస్తోంది. అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి పనులకు పూనుకుంటున్నారు. ఈ నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారతాయి. దేశ జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారు" అని రాహుల్ ప్రశ్నించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్మీ అధికారులు మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్నారు. అధికారులు ఇద్దరూ మధ్యాహ్న సమయంలో మహిళా స్నేహితులతో కలిసి ఛోటీ జామ్‌లోని ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. అయితే వారిని అకస్మాత్తుగా 8 మంది వ్యక్తులు పిస్టల్స్, కత్తులు, కర్రలతో చుట్టుముట్టారు. డబ్బు, నగలు, వస్తువులు దోచుకోవడానికి వచ్చిన దుండగులు ఇద్దరు ట్రైనీ అధికారులను దారుణంగా కొట్టారు. ఒక ఆఫీసర్‌ని, ఒక మహిళను బందీలుగా మార్చుకున్న దుండగులు.. మరో అధికారిని, ఒక మహిళను వదిలిపెట్టి రూ.10 లక్షలు తీసుకొచ్చి బందీలుగా ఉన్నవారిని విడిపించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వారి చెర నుంచి బయటపడ్డ ఆర్మీ అధికారి వేగంగా తన ఆర్మీ యూనిట్ వద్దకు వెళ్లి విషయాన్ని కమాండింగ్ అధికారికి చెప్పారు. ఇదే సమయంలో డయల్-100 ద్వారా పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పోలీసులు, సైనిక అధికారులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. అయితే వాహనాలను ముందుగానే గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు నలుగురినీ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు ఆర్మీ అధికారులకు గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. ఒక మహిళపై అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు బద్గొండ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ లోకేంద్ర సింగ్ హిరోర్ చెప్పారు.

## కౌశిక్ ను చంపే కుట్ర జరుగుతోంది



హైదరాబాద్, సెప్టెంబర్ 12 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నేతలు దాడి చేయటాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఒక ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్భంధంలో ఉంచి పోలీసుల సాయంతో అరికెపూడి గాంధీ అనుచరులు రెచ్చిపోయి దాడులకు పాల్పడటమేమిటని అన్నారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజం, రౌడీయిజానికి అడ్డాగా మార్చేస్తుండటం చూస్తుంటే బాధేస్తుందని అన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న కౌశిక్ రెడ్డిని ఈ ప్రభుత్వం టార్గెట్ చేసిందని అన్నారు. కావాలనే తనపై అక్రమ కేసులు, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బీఆర్ఎస్ బెదరదని కేటీఆర్ స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డిని చంపే కుట్ర చేస్తున్నారని ఆయనకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తానన్న కౌశిక్ రెడ్డిని గృహ నిర్భంధంలో ఉంచిన పోలీసులు.. అరికెపూడి గాంధీని మాత్రం కౌశిక్ రెడ్డి ఇంటికి వచ్చేందుకు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది రౌడీలు కోడిగుడ్లు, రాళ్లతో దాడులు చేశారంటే పక్కా ముందస్తుగా ప్లాన్ చేసే ఈ దాడి చేశారని కేటీఆర్ అన్నారు.

# 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవం

### పబ్లిక్ గార్డెన్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించానున్న సిఎం రేవంత్ రెడ్డి

### ఏర్పాట్లపై అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నత స్థాయి సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గారు ఉదయం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ప్రజా పాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేడు నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవమైన 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పబ్లిక్ గార్డెన్ లో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి గారి ప్రసంగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను సి.ఎస్. ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పీఏ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. 17న గణేష్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియచేయాలని నగర పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ఫైర్ సర్వీసులు డీజీ నాగి రెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## మాండ్యలో మత ఘర్షణలు: 52 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



బెంగళూరు, సెప్టెంబర్ 12: నవరాత్రి ఉత్సవాల వేళ వినాయకుడి ఊరేగింపు సందర్భంగా మాండ్య జిల్లాలోని నాగమంగళ పట్టణంలో మత ఘర్షణలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించి 52 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. బద్రికొప్పలు గ్రామానికి చెందిన పలువురు వినాయకుడిని నిమజ్జనం కోసం ఊరేగింపు తీసుకు వెళ్తున్నారు. ఆ క్రమంలో నాగమంగళ పట్టణంలోని మసీద్ వద్దకు వినాయకుడి ఊరేగింపు చేరుకుంది. ఈ ఊరేగింపుపై పలువురు వ్యక్తులు రాళ్ల దాడికి దిగారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటే చేసుకుంది. దీంతో ఈ ఘటనలో తమకు న్యాయం చేయాలంటూ వినాయకుడి విగ్రహాన్ని పోలీస్ స్టేషన్ ఎదుట పెట్టి ఆందోళనకు దిగింది. అందులోభాగంగా 52 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. తమ వాళ్లు ఏ తప్పు చేయలేదన్నారు. కారణం లేకుండా వారిని అరెస్ట్ చేశారంటూ ఈ సందర్భంగా వారి బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై వారిని ప్రశ్నించేందుకే అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

# బీజేపీలో ఐక్యతా రాగం.. సడెన్‌గా ఏకమైన ఎంపీ, ఎమ్మెల్యేలు



తెలంగాణ భారతీయ జనతా పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు అంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఐక్యతను చాటేలా కీలక మీటింగ్ నిర్వహించారు. బీజేఎల్పీ విస్తృత సమావేశానికి ఎంపీలు సైతం హాజరై రాష్ట్ర సమస్యలపై బీజేపీ పోరాటం సాగుతుందనే సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలైన రుణమాఫీ అమలు, రైతు సమస్యలపై ఒక్కరోజు దీక్ష చేపట్టాలని బీజేపీ శాసనసభాపక్షం నిర్ణయించింది. ప్రస్తుత పరిణామాలపై అసెంబ్లీ ఆవరణలోని బీజేఎల్పీ చాంబర్‌లో పార్టీ శాసనసభాపక్ష విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీ హాజరు కావడం విశేషం. హాజరైన వారిలో ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు రాకేశ్ రెడ్డి, హరీశ్ బాబు, పాయల్ శంకర్, ధన్ పాల్, రామారావు పాటిల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఉన్నారు. రాష్ట్ర సర్కారు సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం పేరిట నిర్వహించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. దీనిపై చర్చించిన బీజేపీ నేతలు విమోచన దినోత్సవంగానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్నారని, 2003 లోనే అక్రమ నిర్మాణాలపై గుజరాత్ లో సీఎం గా మోడీ పక్షపాతం లేకుండా అందరివీ కూల్చివేశారని ఎంపీ అరవింద్ గుర్తు చేశారు. హైడ్రా మాత్రం ఒక వర్గాన్ని టార్గెట్ చేసినట్లు ఉందని.. తమకు సెక్యులర్ హైడ్రా కావాలని అరవింద్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని.. అందరికి రుణమాఫీ చేయాలని సెప్టెంబర్ 20న ధర్నా చౌక్ లో దీక్ష చేయనున్నట్లు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, సెప్టెంబరు 13, 2024


## కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ గా హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్ఫయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్ఫయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్ఫయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు. ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నినాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.

## మెడికల్ అడ్మిషన్లకు స్థానికతపై సుప్రీంకు తెలంగాణ సర్కార్



ఢిల్లీ, సెప్టెంబర్ 12: మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వంసుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోరు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్–2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది.

## ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



రంగారెడ్డి, సెప్టెంబర్ 12 : ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొం దేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 18 వరకు ప్రీ రివిజన్ యాక్టివిటీస్ నిర్వహిస్తామని, అందులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి అక్టోబరు 29 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామని తెలిపారు. దానికి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకుంటారని చెప్పారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నాగార్జున, పార్టీల నాయకులు హరికృష్ణ, నెట్టు ధనుంజయ, జగదీష్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో అవకతవకలు జరగకుండా చూడాలని, ఆ బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని కలెక్టర్ శశాంక అన్నారు.

# వీళ్లు నీతులు మాట్లాడినప్పుడు నవ్వులే నవ్వులు!



నిజమో కాదో కానీ, శ్రీనాథుడికి ఆపాదించి చెబుతారీ కథ. ఒక రాజుని కలవడానికి వెళ్లినప్పుడు, అసూయపడిన ఆస్థానపండితులు అతన్ని దెబ్బతీయాలని ఒక సమస్య ఇచ్చి పద్యంలో పూరించమన్నారట. "అందఱు నందఱే మఱియు నందఱు నందఱె యంద ఱందఱే" అన్నది సమస్య, ఆ సభికుల మీదనే పద్యం చెప్పాలి. అప్పుడా కవిగారు "కొందఱు భైరవాశ్వములు, కొందఱు పార్థుని తేరి టెక్కెముల్, కొందఱు ప్రాక్కిటీశ్వరులు, కొందఱు కాలుని యెక్కిరింతలున్, కొందఱు కృష్ణ జన్మమునం గూసిన ధన్యులు నీ సదస్సులో నందరు నందరే మరియు..." అని పద్యం చెప్పారట. దానితో చిన్నబుచ్చాలనుకున్నవారే చిన్నబోయారట. ఇంతకీ, అందరూ అందరే అయిన ఆ సభికులను ఏమని వర్ణించాడు శ్రీనాథుడు? "కొందరు కుక్కలు, కొందరు కోతులు, కొందరు పందులు, కొందరు దున్నపోతులు, కొందరు గాడిదలు, ఎవరు మాత్రం తక్కువ? అందరూ అందరే, అందరందరే.." అని పద్యం కట్టాడు. కాకపోతే, ఆ జంతుజాలం పేర్లను పచ్చిగా కాకుండా, వాటి వాటి పౌరాణిక పాత్రలను, అందమైన మాటల పొట్లంలో చుట్టి చెప్పాడు. ?స్తుతినింద అన్నమాట. మంచి అయినా, చెడు అయినా, ఎక్కువా తక్కువా కాకుండా, గుంపులోని అందరికీబీ ఒకే రకమైన లక్షణాలుంటే అప్పుడు "అందరూ అందరే" అంటాం. మంచితనం కలిగిన అనేకమందిని ఒకేచోట చూడగలిగే అవకాశాలు అతి తక్కువ. ప్రస్తుత రాజకీయ రంగస్థలాన్ని చూసినప్పుడు మాత్రం, అందరూ అందరే అనిపిస్తే అందుకు బాధ్యత మనది కాదు. శ్రీనాథుడిలాగా కష్టపడి, మభ్యపెట్టే అవసరం కూడా లేదు. అట్లాగని, నేరుగా పోలిస్తే, భైరవుడి గుర్రాలకు, యమధర్మరాజు వాహనాలకు మనోభావాలు దెబ్బతింటాయి. చిట్టచివరకు పిల్లి మెడలో న్యాయరంగం గంట కట్టింది. పిల్లి ఎవరు అన్న విచికిత్స మంచిది కాదు కానీ, ఫిరాయింపుల చెలామణీకి, అధికార పార్టీలకు అందుతున్న సహకారానికి ఇప్పుడు ఇబ్బంది ఏర్పడింది. రాజ్యాంగ విహిత కర్తవ్యాలను నెరవేర్చడానికి అన్ని రాజ్యాంగ వ్యవస్థలు లోబడి ఉండాలని, సభాపతులు ఫిరాయింపుల ఫిర్యాదుల మీద నిర్ణయం తీసుకోవడానికి నిరవధికమైన గడువు ఉండకూడదని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ కీలకమయిన తీర్పు ఇవ్వడానికి ముందు మునుపు సుప్రీంకోర్టు రెండు సందర్భాలలో చెప్పిన తీర్పులు నేపథ్యంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ముగ్గురు ప్రతిపక్ష సభ్యుల ఫిరాయింపు ఈ వ్యాజ్యానికి సందర్భం. ఈ తీర్పు చాలా కీలకమైనది. సభాపతికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి, నియమాలలో ఉన్న కొంత అస్పష్టత కారణంగా ఫిరాయింపులకు ఏర్పడుతున్న సానుకూలతను తొలగించే న్యాయనిర్ణయం ఇది. ఫిరాయింపుల చట్టానికి ప్రాతిపదికలుగా ఉన్న రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను బలపరచే తీర్పు ఇది. అయితే, ఒక కీలకమైన ప్ర?శ్న! ప్రస్తుత కేసులో అయితే కాంగ్రెస్ పార్టీయే ముద్దాయి. ఈ కేసులో నిర్ణయం ఆ పార్టీకి వ్యతిరేకంగా వచ్చిందనే భావించాలి. పిటిషన్‌దారులు బీఆర్ఎస్‌కు చెందినవారు. ఆ పార్టీ ఈ వ్యాజ్యంలో బాధితురాలు. ప్రస్తుత తీర్పు ఆ పార్టీకి విజయం. ఈ రాజకీయ జయాపజయాలు, ఇప్పటికి, ఈ సందర్భానికి మాత్రమే పరిమితం. నిన్న లేవు. రేపు ఉండవు. తాము ఫిరాయింపులను ఆహ్వానించకుంటే, ప్రతిపక్షమే తమ నుంచి సభ్యులను లాగికొని, ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రమాదం ఉన్నదని కాంగ్రెస్ చెబుతుంది. తన ప్రభుత్వాన్ని, విధానాలను స్థిరపరచుకోవడానికి తనకు నాలుగు అదనపు సీట్లు దొరికితే బాగుంటుందని ఆ పార్టీ అనుకుంటుంది. కాంగ్రెస్ కారణాలతో తెలంగాణ సమాజానికి ఏమి నిమిత్తం? రాజ్యాంగ వ్యవస్థల దృష్టిలో ఆ కారణాలకేమి విలువ ఉంది? కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం 64 సీట్లే ఇచ్చింది. ఆ సీట్లతోనే తనకు అధికారమూ వచ్చింది. అది బొటాబొటి మెజారిటీ కదా అంటే, ప్రజలు అంతవరకే ప్రసాదించారు. బీఆర్ఎస్‌కు 38 సీట్లు ఇచ్చి ప్రతిపక్షంగా వ్యవహరించమన్నారు. ప్రతిపక్షబాధ్యత నిర్వహించవలసిన శాసనసభ్యులు అధికారపక్షానికి మారడం కానీ, అధికారపక్షం దాన్ని ప్రోత్సహించడం కానీ, ప్రజాస్వామ్యం రూల్‌బుక్‌లో లేవు. బీజేపీ తాను ఫిరాయింపులకు వ్యతిరేకమని, రాజీనామాలు చేసి రావాలని చెబుతుంది కానీ, సాంకేతికమైన నియమాలను పాటించి, సారాంశంలో పెద్ద అభ్యంతరం లేనట్టే వ్యవహరిస్తుంది. అనధికార పార్టీ సభ్యులుగా ఎందరినో చేర్చుకున్న ఉదంతాలున్నాయి. సభాపతుల సహకారం అధికారపార్టీలకు విశ్వాసపరీక్షల వంటి కీలకసమయాల్లో మాత్రమే అవసరం ఉండేది. గత రెండు దశాబ్దాలుగా, ఫిరాయింపుల నిర్వహణలో కూడా వారి చేదోడు కావలసివస్తోంది. ఫిరాయింపు ఫిర్యాదుల మీద కానీ, ఫిరాయింపు సభ్యుడి రాజీనామా మీద నిర్ణయం తీసుకోవడానికి గానీ ఇదమిత్థమైన గడువు అంటూ ఏదీ లేకపోవడం వల్ల, సభాకాలమంతా ఫిరాయింపుదారుడు సభ్యుడిగా కొనసాగే అవకాశం ఏర్పడుతున్నది. ఆ అవకాశాన్ని వినియోగించుకోని అధికారపార్టీ లేదు. ఇప్పుడు ఈ కేసులో కోర్టుకు వెళ్లిన బీఆర్ఎస్ కూడా ఈ ఫిరాయింపు శాస్త్రంలో పిహెచ్‌డి చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు మీద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా, విలువల ఉద్ఘాటనలు చూస్తుంటే, 'ఔరా, కలికాలము!' అనిపిస్తుంది. వేదాలు, దెయ్యాలు వంటి పోలికలన్నీ పాతపడిపోయాయి కానీ, నైతికధనార్జన గురించి అదానీ, నిరాడంబరత గురించి అంబానీ మాట్లాడినట్టు ఉంటోంది. ఫిరాయింపు సభ్యుడిని మంత్రిని చేసి, సభాకాలం ముగిసేదాకా నడిపించిన చరిత్ర కదా బీఆర్ఎస్‌ది! నిజానికి, కేసీఆర్‌ని, ఆయన పార్టీని రాజకీయ నైతికత విషయంలో తప్పుపట్టవలసింది ఇటీవలి పదవీకాలంలో చేసిన పనుల గురించి కాదు! తెలంగాణ ఉద్యమంలో నిబద్ధత లేని వృత్తిరాజకీయవాదులకు ప్రవేశం కల్పించినందుకు ఆయనను, ఆయన పార్టీని చరిత్ర బోనులో నిలబెట్టాలి! ఎంతో చిత్తశుద్ధి, త్యాగసాహసాలు అవసరమైన ఒక ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించే రాజకీయపార్టీ తన సభ్యులను నిప్పులా నిలుపుకోవాలి! రాజశేఖరరెడ్డి ఫిరాయింపు యాగం మొదలుపెట్టగానే వంగిపోయి అమ్ముడుపోయినవారు నాటి కొందరు టీఆర్ఎస్ శాసనసభ్యులు! చేర్చుకోవడంలోనూ నీతికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వనిది కేసీఆరే! ఒకవైపున నిలువునా కాల్చుకుని, ప్రాణాలు ఇచ్చిన ఉద్యమకారులు సాధించిన తెలంగాణను, ఏ అగ్నిపరీక్షలూ లేకుండా అవకాశవాదులకు అందుబాటులోకి తెచ్చారు! అమ్ముడుపోయే, కొనుక్కోగలిగే సరుకును తెలంగాణ రాజకీయ సమాజంలో ప్రోత్సహించిన వారికి, ఇప్పుడు తమ మందలో నుంచి దొంగిలిస్తున్నారని ఆక్రోశించే హక్కు ఉన్నదా? సభాపతులు సకాలంలో నిర్ణయం తీసుకోవాలని తీర్పు చెబుతున్నది కదా? అంటే, స్పీకర్లు రాజకీయ అనుబంధాలను పక్కనబెట్టి న్యాయనిర్ణయం చేయాలన్న సూచనా ఉన్నట్టే కదా? అంటే సభాపతులు తమ వెన్నెముకలను సవరించుకోవలసిన అవసరం వచ్చింది కదా? కొత్త లోక్‌సభ సభ్యుల ప్రమాణాల సందర్భంగా, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ స్పీకర్ ఓంబిర్లాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలేమిటి? నరేంద్రమోదీ ప్రమాణం చేసిన తరువాత, తనను కలిసినప్పుడు ఓంబిర్లా ఆయన ఎదుట తలవంచారని కదా, రాహుల్ అన్నది? లోక్‌సభ సభాపతి ఎవరి ఎదుట అయినా నిటారుగా ఉండవలసిందేనని కదా ఆయన అభిప్రాయం? మరి తాము పాలించే రాష్ట్రాలలో స్పీకర్లు, ముఖ్యమంత్రుల ఎదుట అమిత విధేయతతో వ్యవహరించకుండా రాహుల్ కానీ, ఆయన పార్టీ కానీ ఏమైనా సూచనలు చేశారా? ఫిరాయింపులతో సహా ఏ వివాదంలో అయినా పార్టీరహితంగా స్వతంత్రంగా వ్యవహరించాలని కాంగ్రెస్ ఒక విలువగా ప్రచారం చేసి, అమలుచేస్తోందా? ఈ ప్రశ్నలు అవసరమైనవి. వీటికి అవును అన్న సమాధానం వస్తే, ఫిరాయింపుల విషయంలో తెలంగాణ స్పీకర్ మరో రకంగా నిర్ణయం తీసుకుంటారన్న ఊహకే ఆస్కారం ఉండేది కాదు. కానీ, దురదృష్టవశాత్తూ, కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో చెబుతున్న సిద్ధాంతాలకు, విలువలకు, క్షేత్రస్థాయి దాకా పాటింపు జరగడం లేదు. జరగాలన్న పట్టింపూ ఆ పార్టీకి ఉండడం లేదు. అదేమంటే, పెద్ద ప్రత్యర్థిని ఎదుర్కొంటున్న అత్యవసర కాలంలో, "చిన్నచిన్న" విషయాలకు మినహాయింపు ఇవ్వాలి కాబట్టి! ఎవరికీ అక్కరలేని ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువ కోసం న్యాయస్థానం చొరవ చూపింది. తక్షణ రాజకీయ ప్రయోజనం కోసం ఆ చొరవను శ్లాఘించేవారే తప్ప, దాన్ని మనసా వాచా ఇష్టపడేవారు లేరు. నువ్వు అధికారంలో ఉన్న కాలంలో ఏమిచేశావు అని ఎదురు ప్రశ్నించడమే తప్ప, కాంగ్రెస్ పార్టీ వద్ద మరో సమాధానం లేదు. పైగా, కోర్టు తీర్పులో దాగిన ఒక ప్రజాస్వామిక సూత్రం మీద కనీస గౌరవం కూడా ఆ పార్టీ చూపించలేదు. చూపించి ఉంటే, కోర్టు నిర్ణయం చెప్పిన రోజునే, పీఏసీ చైర్మన్‌గా ఒక ఫిరాయింపు శాసనసభ్యుడిని నియమిస్తుందా? పైకి, ఇది ప్రతిపక్ష పార్టీకి విసిరిన సవాల్‌గా కనిపిస్తుంది కానీ, వాస్తవంలో అది ఒకరకమైన కోర్టు ధిక్కారమే కదా? ఫిరాయింపు ఎమ్మెల్యేకు తన పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చి నిలబెట్టినప్పుడు చూపిన బోరవిరుపునే కాంగ్రెస్ ఇప్పుడూ చూపింది! వాళ్లూ కాని, వీళ్లూ కాని తెలంగాణ పౌరసమాజం అంటూ ఒకటి ఉంటే, అది ఫిరాయింపుల మీద మాట్లాడాలి. ప్రజలు మాట్లాడితే, నిజానికి, ఏ కోర్టూ నిర్దేశించనక్కరలేదు, రాజకీయంగా నష్టంజరిగే అవకాశం ఉంటే, ఏ పార్టీ కూడా ప్రజాకాంక్షను అతిక్రమించదు. బాధాకరమేమిటంటే, ప్రజలు కూడా అత్యధికులు రాజకీయ పాక్షికులుగా మారిపోయారు. విలువల ఆధారంగా కాక, ఇతర ప్రాతిపదికల మీద రాజకీయపార్టీల వెనుక సమీకృతులవుతున్నారు. వెధవాయను నేను నీకంటె పెద్ద వెధవాయను నేను, అంటూ నాయకులు పోటీపడి అల్పత్వాన్ని ప్రకటించుకుంటుంటే, చప్పట్లు కొడుతూ వినోదం చూస్తున్నారు. మంచీచెడూ తెలిసినవారు, ఏ గొంగట్లో తింటే ఏమిటి అంటూ నిర్లిప్తంగా ఉంటున్నారు.

## గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం




**హైదరాబాద్ :** గచ్చి బౌలిలో రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేసారు. ఒక గెస్ట్ హౌస్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు రేవ్ పార్టీ నిర్వహించారు. ఎనిమిది మంది మంది అమ్మాయిలు, పద్దెనిమిదిమంది యువకులను అరెస్టు చేసారు. వారినుంచి గంజాయితోపాటు మద్యం స్వాధీనం చేసుకున్నారు.

## గాంధీలో డాక్టర్ పై రోగి దాడి




**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో ఒక రోగి డ్యూటీ డాక్టర్ పై దాడికి దిగాడు. రోగి మద్యం మత్తులో ఉన్నట్లు జూనియర్ డాక్టర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జూడాలు సూపరింటెండెంట్ డా. రాజకుమారి ని కలిసారు. వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చరేసారు. కాకపోతే, మా కార్యాచరణ ప్రకటిస్తామని జూడాలు వెల్లడించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటన పై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ఆదేశాలిచ్చారు. బందోబస్తును కూడా పెంచనున్నట్లు హామీ ఇచ్చారు.

## రొయ్యూరులో కేంద్ర బృందం పర్యటన



**పామర్రు :** కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారుల బృందం పంటల నష్టాన్ని వేసేందుకు తోట్లవల్లూరు (మ) రొయ్యూరు గ్రామానికి వచ్చారు. రొయ్యూరులో వంతెన వద్ద రైతులు, అధికారులు నష్టపోయిన వివిధ రకాల పంటలను చూపించారు. వరద ఉధృతికి రైతులు నష్టపోయిన విధానాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, కలెక్టర్ డీకే బాలాజీ, రెవిన్యూ అధికారులు ఛాయాచిత్రాలు, పాడైపోయిన వివిధ రకాల పంట మొక్కలను సెంట్రల్ టీమ్ కు చూపించి వరద తీవ్రతను వివరించారు.కేంద్ర బృందంలో అనిల్ సుబ్రమణియం, సంయుక్త కార్యదర్శి, (ఎూ–ఎ ఁ అూ), కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నాయకత్వంలో రాకేష్ కుమార్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్, హైదరాబాద్ డాక్టర్. ఎస్ వి ఎస్ పి శర్మ, సైంటిస్ట్, కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో రాజు, తాసిల్దార్ కుసుమకుమారి పాల్గొన్నారు

## యువకుడి దారుణ హత్య

**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండలం డి.కొత్తపల్లి శివారులోని శ్రీరామ్ సాగర్ కాల్వ పై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు యువకుడిని హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. తిరుమలగిరి మున్సిపాలిటీ చెందిన వనగండ్ల కుమార్(28) గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. ఘటన స్థలానికి సూర్యాపేట డి.ఎస్.పి రవి,నాగారం సీఐ రఘువీర్ రెడ్డి, నాగారం ఎస్సై ఐలయ్య క్లూస్ టీం తో చేరుకునీ హత్యకు గల కారణాలు దర్యాప్తు చేస్తున్నారు.



## వ్యక్తి మృతదేహం లభ్యం



**మేడ్చల్ :** అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మలక్ పేట్ గ్రామంలోని కుడి చెరువు వద్ద అజిత్ బావి లో వ్యక్తి మృతదేహం గమనించిన స్థానికులు పోలీస్ లకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ లు మృతదేహాన్ని వెలికి తీయగా మారి నర్సింహాగా గుర్తించారు. నర్సింహా మృతి పై కుటుంబకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యావ్యవస్థ మార్పుల దిశగా అడుగులు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా జెట్ స్పీడ్ తో వెళ్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిపుణులు, విద్యావేత్తలతో చర్చలు జరుపుతోంది. ఇటీవలే విద్యా కమిషన్ ను కూడా ఏర్పాటు చేసింది. దానికి చైర్మన్ గా ఆకునూరి మురళిని నియమించింది. పలు సందర్భాల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని విద్యా విధానంలో కీలక మార్పులు తీసుకొస్తామని చెప్పిన విషయం తెలిసిందే. తెలంగాణలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో రాణించేలా మార్పులు తీసుకొస్తామన్నారు. అందుకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు.తెలంగాణలో విద్యా వ్యవస్థపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ బుధవారం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకరావాల్సిన సంస్కరణలపై సబ్ కమిటీ ఈ సమావేశంలో తీవ్రంగా చర్చించింది. ఇటు కోచింగ్ సెంటర్ల నిర్వహణలోనూ పాటించాల్సిన మార్గదర్శకాలపై కూడా ఉపసంఘం చర్చించింది. కేంద్ర మార్గదర్శకాలు రాష్ట్రంలో అమలు కావట్లేదంటూ కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు అమలు చేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్లలో కేంద్ర మార్గదర్శకాలను అమలు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, నీట్, ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చేటువంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేస్తాం. కోచింగ్ సెంటర్లపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో అభ్యర్థుల భద్రత, ఫీజుల భారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయాం. ఇంజినీరింగ్, మెడిసిన్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ నిర్వహిస్తున్న పలు కోచింగ్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా జూనియర్ కాలేజీలను నడుపుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇటు ప్రైవేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కాలేజీల ఫీజుల నిర్ధారణపై నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ స్కూల్స్ ను ప్రతిభా కేంద్రాలుగా తీర్చిదిద్దగలిగితే పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ను వేర్వేరుగా నడపడంతో మానవ వనరుల వృథా అవుతోంది.. అందువల్ల ఈ రెండింటినీ విలీనం చేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించాం' అంటూ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# నితీశ్ కు నో ఎంట్రీ



**పాట్నా :** దేశంలో రాజకీయ వాతావరణం మారినప్పుడుల్లా గోడదూకడం బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు అలవాటుగా మారిందని ఆర్‌జేడీ విమర్శించింది. ఇకపై అతడిని మళ్లీ అక్కున చేర్చుకునేది లేదని ఆ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తేల్చి చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు నితీశ్‌కు అవకాశం కల్పించి మోసపోయామని మళ్లీ అతడు డ్రామాలు మొదలు పెట్టాడని.. ఈ సారి నమ్మేదే లేదని ఆర్జేడీ అధినేత తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ విషయంపై ఆ పార్టీ సీనియర్ నేత.. తేజస్వీ యాదవ్ స్పష్టమైన ప్రకటన చేశారు. బీజేపీతో అలయన్స్‌లో ఉన్నందుకు చేతులు జోడించి తమ పార్టీ ఎమ్మెల్యేల ఎదుట నితీశ్ క్షమాపణలు కోరారని.. అయినా ఆయన్ని విశ్వసించబోయేది లేదని చెప్పారు. ఈ కప్పదాట్ల వ్యవహారాలకు కాలం చెల్లిందని.. రెండు సార్లు మోసపోయిన తాము మరోసారి మహాకూటమిలోకి ఆయన్ని రానిచ్చేదే లేదని.. మహాఘట్ బంధన్ ద్వారాలు మరోసారి ఆయన కోసం తెరుచుకోబవని తేజస్వీ కుండబద్దలు కొట్టారు. నితీశ్ కుమార్ తేజస్వీతో భేటీ అయిన కాసేపటికే ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. నితీశ్ చేసే ప్రమాణాలన్నీ నీటి మూటలనేనని.. అతడిపై ఎవరికీ నమ్మకం లేదని.. ఆయన ఎప్పుడైనా తన మనసు మార్చుకోగల ఊసరవెల్లి అని తేజస్వీ వ్యాఖ్యానించారు. రెండు సార్లు జాలిపడి రాజకీయంగా ప్రాణదానం చేస్తే ఆ వెంటనే తమకు వెన్నుపోటు పొడిచారని తేజస్వీ పేర్కొన్నారు. ఈ సారి మాత్రం అలాంటి తప్పు జరగబోదన్నారు. అర్‌జేడీని రూట్ లెవల్లో పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తేజస్వీ యాదవ్ ఆభార్ యాత్రను మంగళవారం ప్రారంభించారు. తొలిరోజును కార్యకర్త సందర్శన్–సంవాద్ పేరుతో కార్యకర్తల కష్టనష్టాలను విన్నారు. వారి నుంచి పార్టీ కోసం సలహాలు తీసుకున్నారు. భాజపా– జేడీయూ అలయన్స్‌లో నితీశ్ నేతృత్వంలో కొనసాగుతున్న సర్కార్‌కు బిహార్ ప్రజల రక్షణ గురించి అసలు పట్టడం లేదని.. లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిని నేరాలు మితి మీరి పోయాయని తేజస్వీ ధ్వజమెత్తారు. 2025 ఎన్నికల్లో తాము అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు.మొదటిసారి 2013లో ఎన్డీయే అలయన్స్ నుంచి బయటకు వచ్చిన నితీశ్ ఆ కూటమితో 17 బంధానికి తెరదించారు. ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్నారు. వెంటనే వ్యూహం మార్చిన ఆయన.. ఒకప్పటి స్నేహితుడు, నాటికి ఆగర్భ శత్రువులా ఉన్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు స్నేహహస్తం అందించారు. ఆ తర్వాత 2015లో ఆర్జేడీ తో అధికారం పంచుకున్న నితీశ్.. రెండేళ్లు తిరగక ముందే మహాఘుట్‌బందన్‌కు రాంరాం చెప్పి మళ్లీ ఎన్డీయే తో కలిశారు. 2020 ఎన్నికల్లో మళ్లీ భాజపాతో కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్న నితీశ్ మళ్లీ 2022లో భాజపాకు దూరం జరిగి ఆర్జేడీ తో జట్టు కట్టి మహాఘట్‌బంధన్‌కు జైకొట్టారు. మళ్లీ 2024 సార్వత్రిక సమరం సమయానికి ఎన్డీయే గూటికి చేరి కూటమిలో మూడో అతి పెద్ద పార్టీగా అవతరించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల సైరన్ మోగే సమయం దగ్గర పడుతుండడంతో ఆర్జేడీ కి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే ఈ సారి నితీశ్‌ను నమ్మేది లేదని ఆర్జేడీ అధినాయకత్వం తేల్చిచెప్పింది.

# కాకతీయ భూములపై విజిలెన్స్



**వరంగల్ :** కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు రెండు రోజులుగా వర్సిటీ చుట్టూ ఉన్న ఆక్రమణలను తేల్చేందుకు సర్వే చేస్తుంది. ముఖ్యంగా సర్వే నెంబర్ 229 భూములలో సర్వే చేసి సరిహద్దు గుర్తించింది. ఇక్కడ ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు రెండు రోజులుగా యూనివర్సిటీ చుట్టూ ఉన్న కబ్జాలు తేల్చే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్, కాకతీయ యూనివర్సిటీ డెవలప్ మెంట్ ఆఫీసర్స్ తో కలిసి విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్ స్పెక్షన్ చేస్తున్నారు. ప్రధానంగా ఎప్పటి నుంచో ఆరోపణలున్న సర్వే నెంబర్ 229 భూములపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బుధవారం ఆ సర్వే నెంబర్ చుట్టూ పక్కల ఉన్న బౌండరీలను గుర్తించారు. ఆ భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో కుమార్ పల్లి, లష్కర్ సింగారం, పలివేల్పుల గ్రామాల పరిధిలోని 673.12 ఎకరాల భూమిని సేకరించారు. కానీ కేయూ క్యాంపస్ చుట్టూ సరైన విధంగా రక్షణ లేని కారణంగా ఆక్రమణలు వెలిశాయి. ముఖ్యంగా కుమార్ పల్లి శివారులోని 229 సర్వే నెంబర్, పలివేల్పుల శివారు 412, 413, 414, లష్కర్ సింగారం శివారు 34 సర్వే నెంబర్ లో కూడా కబ్జాలు జరిగాయనే ఆరోపణలున్నాయిఇదిలా ఉంటే కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ బాబుతో పాటు మరికొంతమంది కుమార్ పల్లి శివారు 229 సర్వే నెంబర్ లోనే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోనే గతంలో వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టారు. రూ.కోట్లు విలువైన యూనివర్సిటీ భూములను అధికారులే నొక్కేస్తున్నారంటూ నిరసనలు కూడా కొనసాగించారు. ఆ తరువాత అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) అధ్యక్ష, కార్యదర్శులు ప్రొ.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో ఇదివరకు వీసీతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గత ప్రభుత్వ పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత మరోసారి ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి కూడా ఫిర్యాదు చేశారుఅకుట్ ఫిర్యాదుతో పాటు కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణ విజ్ఞప్తి మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు కాకతీయ యూనివర్సిటీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. విజిలెన్స్ సీఐలు రాకేష్, అనిల్ ఆధ్వర్యంలో గత నెల 31వ తేదీన మొదటి దఫా జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించారు. కేయూ అధికారులతో పాటు మున్సిపల్, రెవెన్యూ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ తదితర శాఖల అధికారులతో కలిసి సర్వే చేపట్టారు.ఇదిలాఉంటే వర్సిటీ భూముల్లో ప్రధానంగా కుమార్ పల్లి శివారు సర్వే నెంబర్ 229 లో కేయూ అధికారి అయిన అశోక్ బాబు ఇల్లు ఉండటంతో ఆఫీసర్లు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ముఖ్యంగా ఇదే సర్వే నెంబర్ పై ఆరోపణలు ఎక్కువగా ఉండటంతో రెండు రోజులుగా అదే ల్యాండ్ లో అధికారులు సర్వే జరుపుతున్నారు. మంగళవారం సర్వే నెంబర్ 229 భూమిని పరిశీలించిన విజిలెన్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కేయూ, మున్సిపల్ అధికారులు.. బుధవారం డీమార్కేషన్ చేపట్టారు. ఈ మేరకు సర్వే నెంబర్ 229లో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.ఆఫీసర్లు కబ్జాగా గుర్తించిన సర్వే నెంబర్ 229లో చాలా వరకు ఇళ్లు వెలిశాయి. కాగా బుధవారం జాయింట్ ఇన్ స్పెక్షన్ టీమ్ అధికారులు హద్దులు గుర్తించి మార్కింగ్ వేయడంతో అక్కడ ఇల్లు కట్టుకుని ఉంటున్న వారిలో గందరగోళం మొదలైంది. ఇదిలాఉంటే ఓ వైపు సర్వే జరుగుతుండగా.. మరోవైపు కబ్జా ఆరోపణలున్న ఇళ్ల యజమానులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు నోటీసులు కూడా జారీ చేశారు. దాదాపు 76 మందికి నోటీసులు అందజేశారు. దీంతో అందులో కొంతమంది కోర్టుకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలాఉంటే ఇప్పుడిప్పుడే కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణల వ్యవహారం ఓ కొలిక్కి వస్తుండటంతో భూఆక్రమణ దారుల్లో కలవరం మొదలైంది. కాగా కాకతీయ యూనివర్సిటీ చుట్టూ సమగ్ర భూసర్వే నిర్వహించి, అన్యాక్రాంతమైన భూములను కబ్జా చెర నుంచి విడిపించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలతో పాటు అకుట్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు

## చాక్లెట్ కంపెనీలో అగ్ని ప్రమాదం



**కుత్బుల్లాపూర్ :** పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి భాగ్యలక్ష్మి కాలని లోని ఓ చాక్లెట్ తయారీ కంపెనీ లో అగ్ని ప్రమాదం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు.

## ఎమ్మెల్యేఅరికపూడి గాంధీ కౌశిక్ రెడ్డి కి సవాల్




**హైదరాబాద్ :** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సవాల్ విసిరారు. అరికపూడి గాంధీ ఇంటికి వచ్చి టిఆర్ఎస్ కండువా కప్పుతానంటూ పాడి కౌశిక్ రెడ్డి వాఖ్య చేసిన సంగతి తెలిసిందే. నువ్వు 11 గంటలకు వస్తా అన్నావు రాకుంటే నీ ఇంటికి వస్తానని గాంధీ అన్నారు. నా ఇంటి వద్ద పోలీసు బందోబస్తు అవసరం లేదు. నీ దమ్ము ఏంటో మా దమ్ము ఏంటో తేల్చుకుందామని అన్నారు.

## సింగరేణి కార్మికుల డిపెండెంట్ల నిరసన



**రామగుండం :** పెద్దపల్లి జిల్లా రామగుండం సింగరేణి సంస్థ అర్జీ వన్ జీఎం ఆఫీస్ ఎదుట కార్మికుల డిపెండెంట్లు నిరసన ప్రదర్శన చేశారు. మారు పేర్లతో విధులు నిర్వహించే కార్మికుల రిటైర్మెంట్ తర్వాత వారి పిల్లలకు సంస్థలో ఉద్యోగాలు కల్పించాలని ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్మికుల మారు పేర్లు, విజిలెన్స్ ఎంక్వయిరీ పేరుతో యాజమాన్యం వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంలో జాప్యం చేస్తుందని ఆందోళన చేపట్టారు. అంతేగాకుండా కార్మిక సంఘాల నాయకులు ఉపాధి కల్పించడంలో న్యాయం చేయాలని డిపెండెంట్స్ కోరుతున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయకుండా... ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇప్పటికే ఆర్థికంగా, మానసికంగా మా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి లో ఉద్యోగాలు వస్తాయని కార్యాలయాల చుట్టూ తిరిగిన అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సాగర్ గేట్లు మూసివేత




**నల్గొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కు వరద ఉధృతి తగ్గడంతో.. డ్యామ్ లోని మొత్తం క్రస్ట్ గేట్లను మూసేశారు. ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 44 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుండగా.. అంతే మొత్తంలో పవర్ హౌస్.., కుడి, ఎడమ కాలువలుచ ఏఎంఆర్పీ వరద కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను ప్రస్తుతం 589 అడుగులుగా ఉంది. అలాగే డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312 టీఎంసీలకు గాను.. 309.0570 టీఎంసీలకు చేరింది.

## ముంపు బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**పిఠాపురం :** ఏలేరు ప్రాజెక్ట్ నుండి నీటి విడుదల కారణంగా పిఠాపురం నియోజకవర్గం ముంపుకు గురైన ప్రాంతల్లో ఇబ్బందులు పడుతున్న బాధితులకు రూరల్ ఎస్ ఆర్ ఎం టి ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో షీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు ఐదు లక్షల రూపాయలు విలువచేసే నిత్యావసర సరుకులను పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రేడి శ్రీనివాస్ సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ రూరల్ నుండి బాధితులకు సహాయం అందిస్తున్న ఎస్ ఆర్ ఎం టి ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, షీ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి చేతనైనంత సహాయాన్ని అందించడానికి అందరం ముందుకు రావాలని కోరారు. మానవత్వం ప్రదర్శించాల్సిన సమయము ఇది అని అందులో భాగంగానే తమ వంతు సహాయంగా వరద బాధితులకు నిత్యవసర వస్తువులను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెన్నానదిలోకి భారీ బోట్లు



**కోవూరు :** నెల్లూరు పెన్నానదిలోకి భారీ బోట్లను దించుతున్నారు. పోతిరెడ్డిపాలెం సమీపంలో పెన్నానదిలోకి రెండు భారీ బోట్లను లారీల్లో తీసుకొచ్చి.. జేసీబీల సాయంతో నీటిలోకి దించారు. అయితే ఈ బోట్లను ఎందుకు తీసుకొచ్చారనే సమాచారం మాత్రం ఎవరూ చెప్పడం లేదు. కొందరు మాత్రం పెన్నానదిలో నుంచి ఇసుకను బయటకు డంప్ చేసేందుకు తీసుకొచ్చారని అంటున్నారు. దీనిపై అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు అయితే పోతిరెడ్డి పాలెం ప్రజలు మాత్రం ఏం జరుగుతుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. గత 2021 లో కూడా పెన్నా పొర్లు కట్ట అ ప్రాంతంలో తెగడంతో ఊరు మొత్తం మునిగిపోయి భారీ ముప్పు సంభవించింది. ఇప్పుడు అక్కడే పెద్ద పెద్ద భారీ బోట్లను దించుతున్నారు. మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

## బోట్ల కటింగ్ పనులు?. అంత సులభం కాదు



**విజయవాడ :** విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద అడ్డుపడిన బోట్లను తొలగించేందుకు అధికారులు, కార్మికులు శ్రమిస్తున్నారు. పది మందితో కూడిన డైవింగ్ టీమ్ నదిలోకి దిగి పడవలను ముక్కలుగా చేస్తున్నారు. బోట్లు దృఢంగా ఉండటంతో ఉదయం నుంచి కొంతమేర మాత్రమే కట్ చేయగలిగారు. దీంతో ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తొలుత బోట్లను క్రేన్ ద్వారా లిఫ్ట్ చేయాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు.

## ఏలేరులో వ్యక్తి గల్లంతు



**జగ్గంపేట :** ఏలేరు వరద ఉధృతికి కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. ఏలేరు వరద నీటితో రోడ్లు పొలాలు సైతం ఏకమైపోయాయి. ఎక్కడ చూసిన చెరువులను తలపిస్తున్నాయి. దీంతో భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతున సుబ్బారావు ఏలేరు వరద ఉధృతికి అర్ధరాత్రి గల్లంతైనట్లు తెలుస్తోంది. రాత్రి నుంచి గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు. అచూకీ లభించకపోవడంతో రంగంలోకి ఎస్ డి అర్ ఎఫ్ బృందాలు దిగాయి. టీమ్ హెడ్ రామకృష్ణ అధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున నుండి గాలింపు చర్యలు చేస్తున్నార్గ.శ

## విశాఖ నుంచి మరిన్ని సర్వీసులు




**విశాఖపట్టణం :** విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మరో నాలుగు కొత్త సర్వీసులు నడవనున్నాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ వైజాగ్ నుంచి నాలుగు విమాన సర్వీసులను నడపనుంది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ కృషి వల ఇండిగో ఎయిర్‌లైన్స్ ఈ నిర్ణయం తీసుకుంది. నాలుగు సర్వీసులలో ఒకదాన్ని ఈ నెలలోనే ప్రారంభించనున్నారు. మిగతా మూడు సర్వీసులను అక్టోబర్ నెలలో ప్రారంభించనున్నారు. సెప్టె?ంబర్ 21న ఉదయం 9 గంటలకు విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు కొత్త విమాన సర్వీసు ప్రారంభం కానుంది. అలాగే అక్టోబర్ 27న విశాఖ- విజయవాడ, విశాఖ- హైదరాబాద్ సర్వీస్ ప్రారంభం కానుంది. విశాఖపట్నం- విజయవాడ మధ్య ప్రారంభమయ్యే సర్వీసు ఉదయం 9 గంటల 15 నిమిషాలకు స్టార్ట్ కానుంది. ఇక వైజాగ్- హైదరాబాద్ మధ్య అక్టోబర్ 27న ప్రారంభమయ్యే సర్వీసు మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖ విమానాశ్రయం నుంచి బయల్దేరనుందని అధికారులు తెలిపారు. వీటితో పాటుగా విశాఖపట్నం- అహ్మదాబాద్ మధ్య వారానికి మూడు రోజులపాటు కొత్త సర్వీసును కూడా అక్టోబర్ నెలలో ప్రారంభించనున్నారు. ఇక అధికారుల నిర్ణయం పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నుంచి విజయవాడకు, హైదరాబాద్ మధ్య నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఈ క్రమంలోనే విశాఖ నుంచి నూతన సర్వీసులు ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విశాఖపట్నం విమానాశ్రయంలో ఇటీవలే నూతన సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. డిజీ సేవలను విశాఖ ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇటీవల ప్రారంభించారు. విశాఖతో పాటుగా రాంచీ, భువనేశ్వర్, ఇండోర్, గోవా, పట్నా, రాయ్‌పూర్, కోయంబత్తూరు సహా 9 చోట్ల డీజీ సేవలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. వీటితో కలిపి దేశవ్యాప్తంగా ఉన్న 24 విమానాశ్రయాల్లో డీజీ యాత్ర సేవలు అందుబాటులోకి వచ్చినట్లు కేంద్రం తెలిపింది. ఇక ఈ సేవలు అందుబాటులోకి రావటం ద్వారా ప్రయాణికులు విమానాశ్రయంలోకి సులభంగా ప్రవేశించేందుకు వీలవుతుంది. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా ఈ యాప్ పనిచేస్తుంది. దీనిని ఇప్పటి వరకూ మూడు కోట్ల మంది విమాన ప్రయాణికులు వినియోగించుకున్నారు.

# సెబ్ స్థానంలో ఎక్సైజ్

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో వైసీపీ హయాంతో ఏర్పాటు చేసిన సెబ్ ను రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు కేటాయించిన 4,393 మంది (70 శాతం) ఎక్సైజ్ శాఖ సిబ్బందిని తిరిగి మాతృ శాఖలోకి తీసుకువచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ హయాంలో సెబ్ ఏర్పాటు చేయకముందు ఉన్న తరహాలో ఎక్సైజ్ శాఖ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సెబ్ రద్దు చేసేందుకు ఏపీ కేబినెట్ అమోదం తెలిపింది. ఈ క్రమంలో సెబ్ రద్దు చేస్తున్నట్లు అధికారిక ఉత్తర్వులను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు విడుదల చేశారు. సెబ్ ఏర్పాటు చేసే సమయంలో ఎక్సైజ్ శాఖలో ఉన్న 6,274 మంది సిబ్బంది ఉండగా, వారిలో 1,881 (30 శాతం) మందిని అదే శాఖలో ఉంచారు. మిగతా సిబ్బంది గత వైసీపీ ప్రభుత్వం సెబ్ లోకి తీసుకొచ్చింది. తాజాగా ఏపీ ప్రభుత్వం సెబ్ రద్దు చేయడంతో ఆ సిబ్బందిని తిరిగి మాతృశాఖ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కు తిరిగి తీసుకొస్తున్నారు. ఐజీ ర్యాంకు ఉన్న ఓ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో త్వరలో ఎన్‌ఫోర్స్‌వెంట్ విభాగం ఏర్పాటు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యంపై భారీగా దోపిడీ జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో మద్యంపై టార్గెట్ పెట్టి, తమదైన రీతిలో మద్యంపై భారీగా అక్రమం సంపాదన పోగేశారని ఆరోపణలున్నాయి. క్రెడిట్, డెబిట్ కార్డులు, ఆన్ లైన్ ట్రాన్సాక్షన్ బదులుగా ఆఫ్‌లైన్ విధానంలో మద్యం విక్రయాలతో అపరిమిత దోపిడీకి వైసీపీ ప్రభుత్వం తెరతీసిందని టీడీపీ, బీజేపీ నేతలు పలుమార్లు ఆరోపించారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరీ సైతం ఓసారి మద్యం దుకాణానికి వెళ్లి ఆరోజు జరిగిన మద్యం విక్రయాలు, లెక్కలు చెక్ చేసి లెక్కలు బయటపెట్టడం అప్పట్లో దుమారం రేపింది. మద్యంపై జగన్ భారీగా పోగేశారని, లిక్కర్ విక్రయాల ఆదాయం తాడేపల్లి ప్యాలెస్ కు వెళ్తోందని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సైతం అప్పటి విపక్ష నేతలు ఢిల్లీకి వెళ్లి సైతం ఫిర్యాదు చేయడం తెలిసిందే

## గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కలకలం రేపిన చిన్నారి విక్రయం




**గుంటూరు :** గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారి విక్రయం ఘటన కలకలం సృష్టించింది. చిన్నగంజాంకు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి 1.90 లక్షల రూపాయలకు తన బిడ్డను విక్రయించారు. వివరాల్లోకి వెళితే.. సుబ్రహ్మణ్యం కొద్ది రోజుల క్రితం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తన భార్య లక్ష్మిని డెలివరీ కోసం తీసుకెళ్లాడు. ఆడ శిశువుకు జన్మనిచ్చిన సుబ్రమణ్యం భార్య లక్ష్మి కన్నుమూసింది. గతంలోనే లక్ష్మికి ఎనిమిది మంది సంతానం ఉంది. అదే ఆస్పత్రిలో డెలివరీ కోసం భట్టిప్రోలుకు చెందిన మీరాభి చేరింది. డెలివరీ తర్వాత మీరాభికి పుట్టిన శిశువు ప్రాణాలు విడిచింది. అదే సమయంలో మీరాభి స్నేహితురాలు ప్రభావతి.. సుబ్రమణ్యంతో చిన్నారి కోసం సంప్రదింపులు జరిపింది. తన పాపను ఇచ్చేందుకు సుబ్రమణ్యం అంగీకరించారు. ఈ నెల 7వ తేదీన సుబ్రహ్మణ్యాన్ని ఒప్పించి శిశువును తీసుకువెళ్లేందుకు మీరాభి కుటుంబ సభ్యులతో చిన్నగంజాంకు వచ్చింది. వారు ఎట్టకేలకు సుబ్రహ్మణ్యాన్ని ఒప్పించి శిశువుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బిడ్డ పుట్టి చనిపోవడంతో, తీవ్ర మనోవేదనలో ఉన్న తన మిత్రురాలు మీరాభికి సుబ్రహ్మణ్యం వద్ద కొనుగోలు చేసిన శిశువును స్నేహితురాలు ప్రభావతి తీసుకువచ్చి ఇచ్చింది. బిడ్డ పుట్టి చనిపోయిన మహిళ వద్ద మరో బిడ్డను చూసి అనుమానం వచ్చి జీజీహెచ్ సిబ్బంది ప్రశ్నించారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో బిడ్డను 1.90 లక్షలకు కొనుగోలు చేసినట్లు ప్రభావతి ఒప్పుకుంది. శిశువు కొనుగోలుపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కొత్తపేట పోలీసులు కేసును చినగంజం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

## అధికారులతో ముగిసిన కేంద్ర బృందం భేటీ

**అమరావతి :** ఏపీఎస్డిఎంఎ కార్యాలయం లో దాదాపు రెండున్నర గంటల పాటు రాష్ట్ర అధికారులతో కేంద్ర బృందం సమావేశమయింది. వరద సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగం అహర్నిశలు పని చేసిన తీరును అధికారులు వివరించారు. వరద ప్రభావిత ప్రాంత బాధితులకు కోటికి పైగా ఆహార ప్యాకెట్స్, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశామని తెలిపారు. వరద సహాయక చర్యల్లో భాగంగా బాధితులకు ఆహారం, త్రాగునీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు పంపిణీ చేశామని న అధికారులు తెలిపారు. భావిత ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సాయం అందించామని వెల్లడించారు. వేలాది మంది ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించామని వెల్లడించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముంపు ప్రాంతాలు, సహాయక చర్యలను కేంద్ర బృందానికి వివరించారు,. విజయవాడ పురపాలక పరిధిలో దెబ్బతిన్న ప్రాంతాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో కేంద్ర బృందానికి చూపించారు. ఇళ్లలో దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు, గృహోపకరణాలను సిబ్బందితో మరమ్మత్తులు చేయిస్తున్నామని తెలిపారు.




వ్యవసాయం, రైతు సంక్షేమం డైరెక్టర్ డా.ఎ.ఎల్. వాగ్మెర్ నేతృత్వంలో నేడు బాపట్ల, గుంటూరు జిల్లాలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను, జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించింది. కేంద్ర బృందంలో సభ్యులు : అనిల్ సుబ్రహ్మణ్యం, కేంద్ర హోం వ్యవహారాల జాయింట్ సెక్రటరీ, డా.ఎ.ఎల్. వాగ్మెర్, వ్యవసాయం రైతు సంక్షేమం, డైరెక్టర్, మహారాష్ట్ర, రాకేష్ కుమార్, రోడ్లు, రవాణా మరియు హైవేస్ చీఫ్ ఇంజినీర్, విజయవాడ, ఆర్. బి. కౌల్, ఆర్థిక శాఖ కన్సల్టెంట్(ఈఅఆ), న్యూ ఢిల్లీ, ప్రదీప్ కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ, డా. ఎస్.వి. ఎస్. పి. శర్మ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో శాస్త్రవేత్త

## జాతీయ రహదారిపై ప్రమాదం



**ముమ్మిడివరం :** ముమ్మిడివరం మండలం బొండాయికోడు సమీపంలో జాతీయ రహదారిపై నుండి పంట కాలువలోకి బొల్తా పడింది. ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ముమ్మిడివరం పోలీసులు విచారిస్తున్నారు

## ప్రజాహితం కోసం నా పోరాటం : సీఎం చంద్రబాబు



**ఏలూరు :** రైతులు, వరద బాధితులు ముఖాముఖిలో ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు మాట్లాడారు. నేరస్థులు రాజకీయ ముసుగు వేసుకున్నారు. తొమ్మిదేళ్లలో రౌడీలు అనే వారు లేకుండా చేశాం. ఇప్పుడు నాకు పెను సవాలుగా వుంది. రాజకీయ పార్టీపై దాడి చేసిన వారిని అరెస్టు చేస్తే ధర్నాలు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాలపై, వ్యక్తులపై గతంలో ఎప్పుడూ దాడులు లేవు. ఒక నేరస్తుడితో ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నాను. ప్రజా హితం కోసం ఈ పోరాటం చేస్తున్నాను. ప్రజలు శభాష్ అనేలా అధికారులు పనిచేసారు. నేను తిరుగుతున్నానని తెలిసి హెలికాప్టర్లలో తిరిగే వాడు ఒకరోజు వచ్చి బురదలో దిగాడు... మళ్ళీ కనిపించలేదు. ఖజానా ఖాళీ...అభివృద్ధి లేదు, అప్పుల వాళ్ళు తిరుగుతున్నారని అన్నారు. మన సంపాదన. ప్రజలు గత ఎన్నికల్లో మంచి పనిచేసారు... కూటమి అభ్యర్థులను గెలిపించారు. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చారు. మనం ఎన్డీయేలో భాగస్వామ్యం కాబట్టి కేంద్రం కూడా సహాయం అందిస్తోంది. మేము ఇచ్చిన హామి ప్రకారం మీ జీవితాల్లో వెలుగు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.

## వరద ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన



**విజయవాడ :** విద్యాధరపురం, జక్కంపూడి, కుందావారి ఖండ్రికలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ,ఆయన కుమార్తె సింధూర పర్యటించారు. అధికారులతో కలిసి జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ తో పాటు బుడ మేరు ప్రవహించే మార్గాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వరద తగ్గిన చోట సాయంత్రానికి పారిశుద్ధ్యం సాధారణ స్థితికి తీసుకురావాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. బుడ మేరు ప్రవాహానికి ఉన్న ఆటంకాలను అధిగమించడం పై అధికారులకు సూచనలు చేసారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ 10 రోజులపాటు సీఎం తో పాటు మంత్రులు,అధికారులు కష్టపడి వరద ప్రాంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చారు. కొన్ని చోట్ల మినహా దాదాపు అన్ని ప్రాంతాల్లో వరద తగ్గిపోయింది. ఐదు ప్రాంతాల్లో సాయంత్రానికి సాధారణ పరిస్థితి తీసుకొస్తాం. మున్సిపల్ ,పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో పారిశుధ్యం మెరుగుపరుస్తాం. 10 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉన్నారు. బుడ మేరు ఉండాల్సిన విస్తీర్ణం కంటే చాలావరకూ కుచించుకుపోయింది.. ఆపరేషన్ బుడ మేరు ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తఆమని అన్నారు.

## వైకాపా నేత పాలడుగు దుర్గాప్రసాద్ అరెస్టు



**గుంటుపల్లి :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడి ఘటనలో పాల్గొన్న వైసీపీ నేత పాలడుగు దుర్గాప్రసాద్ని పోలీసులు బుధవారం తన నివాసం గుంటుపల్లి లో అరెస్ట్ చేశారు. తనతో పాటు తన అంతరగికుడు సానం పూడి.బాలు ని కూడా అరెస్టు చేశారు. గత కొంత కాలంగా పాలడుగు దుర్గాప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ రోజు దుర్గాప్రసాద్ గుంటుపల్లిలోని తన నివాసంలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగుదేశం కార్యాలయం, చంద్రబాబు నివాసం పై దాడితోపాటు, మాజీ మంత్రి దేవినేని ఉమాపై కూడా పాలడుగు దుర్గా ప్రసాద్ దాడికి పాల్పడ్డాడని ఆరోపణ

# సిరుల పంట అంజూర

## పెరుగుతున్న సాగు విస్తీర్ణం.. ఎకరాకు 1.6లక్షల ఆదాయం



ఔషధ గుణాలు, పోషక విలువలతో పాటు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ వున్న అంజూర సాగుపై నానాటికీ ఆసక్తి పెరుగుతోంది. మందుల తయారీలో, జామ్‌గా, పండ్లతో పాటు ఎండబెట్టి కూడా అంజూరను ఉపయోగిస్తున్నారు. నాణ్యమైన అంజూర రావాలంటే పొడి వాతావరణం ఉండాలి. కొద్దిపాటి వర్షపాతం నమోదయ్యే ప్రదేశాలు ఈ పంటకు చాలా అనుకూలం. కాయలు పక్వానికి వచ్చే సమయంలో వర్షాలు లేకుండా ఉండాలి. ఎర్రనేలల్లో అంజూర సాగు చేస్తే తీయని కాయలు కాస్తాయి.బాగా ముదిరి 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన అంజూర కొమ్మలను ఎంచుకొని వాటి నుండి 1.25-2 సెం.మీ మందం, 20-30 సెం.మీ పొడవు కలిగిన కొమ్మలను కత్తిరించి 24 గంటలలోపు నారుమడిలో నాటాలి. నాటే ముందు కొమ్మ పైభాగాన్ని బ్లైటాక్సు పూసి, వేర్లు త్వరగా రావడానికి కింది భాగాన్ని హార్మోన్ల (సెరాడిక్స్) ద్రావణంలో ముంచి నాటితే నారుమడిలో ఎక్కువ వేర్లు వచ్చి బాగా నిలదొక్కుకునే అవకాశం ఉంది. నారుమడిలో బాగా పెరిగిన 12-15 నెలల వయస్సు కలిగిన మొక్కలను 12-10 సెం.మీ దూరంలో 45 సెం.మీ పొడవు, వెడల్పు, లోతు కలిగిన గుంతలు తీసి, ప్రతీ గుంతలో 5 కిలోల పశువుల ఎరువు, 500 గ్రాముల సూపర్ ఫాస్పేట్ వేసి నింపుకోవాలి.గుంత మధ్యలో మొక్కను నాటుకొని కర్రతో ఊతం ఇవ్వాలి. నాటిన 3 నెలల తరువాత మొక్కలో 3వ భాగాన్ని కత్తిరించి దాని నుంచి 3 లేక 4 పక్కకొమ్మలు వచ్చేలా చేయాలి. ఈ పక్కకొమ్మలు అన్నీ సమాన దూరంలో ఉండేలా చూడాలి. ఇవి 6-8 సెం.మీ మందం పెరిగాక వీటి నుంచి వచ్చే ద్వితీయ కొమ్మలపై పూత, కాయ వస్తాయి. రెండో సంవత్సరంలో ద్వితీయ శాఖల అర్ధభాగాన్ని తీసివేసి వాటి నుంచి కాయలు వచ్చేలా చూడాలి. మూడో సంవత్సరంలో తృతీయ శాఖల మీద 6 నుంచి 9 కణపుల నుంచి మిగిలిన భాగాన్ని కత్తిరించాలి. ఈ విధంగా కత్తిరించడం వల్ల పక్కకొమ్మలు బాగా పుట్టి పూత, కాయ బాగా వచ్చే అవకాశముంది. కత్తిరించిన మొక్కల్లో దిగుబడి బాగా వస్తుంది. జూన్‌లో, నవంబర్‌లో కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలి. అంజూర అన్ని రకాల నేలల్లో పెరిగినా నీటి ఎద్దడి తట్టుకోలేదు. తేలిక నేలల్లో, వేసవిలో 3 రోజుల వ్యవధిలో నీటినివ్వాలి. డ్రిప్ ద్వారా అయితే రోజుకు 7 గంటల చొప్పున, ప్రతీ మొక్కకు 20 లీటర్ల చొప్పున నీరందించాలి. కాయ పెరిగే దశలో నీటి అవసరం ఎక్కువ ఉంటుంది. ప్రతి సంవత్సరం అంజూర మొక్కకు 5 కిలోల పశువుల ఎరువు, 1 కిలో వేప పిండిని కొమ్మ కత్తిరింపుల తరువాత వేసుకోవాలి. అరకిలో యూరియా, ఒక కిలో సూపర్‌ఫాస్పేట్, అరకిలో మ్యూరేట్ ఆఫ్ పొటాషను 3 భాగాలు చేసి సంవత్సరంలో 3 సార్లు ఫిబ్రవరి-మార్చి, జూన్-జూలైలో, అక్టోబర్-నవంబర్‌లో వేసుకోవాలి. నీటిలో కరిగే 19:19:19 అమ్మోనియం సల్ఫేట్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్, బోరాక్స్, మెగ్నీషియం సల్ఫేట్‌లను ఫర్టిగేషన్ పద్ధతిలో ఒక కిలో చొప్పున అందించాలి. అంజూరలో అంతర పంటలుగా కాలీఫ్లవర్, టమాటాలను పండించుకోవచ్చు.నాటిన తొమ్మిది నెలల నుంచి కాయలను కోయవచ్చు. అంజూర కాయలన్నీ ఒకేసారి పక్వానికి రాకపోవడం వల్ల రోజూ కాయలు కోసుకోవాలి. రోజుకు ఒక ఎకరానికి 25 కిలోల నుంచి 30 కిలోల వరకు కాయ దిగుబడి వస్తుంది. ఏడాదిలో తొమ్మిది నెలల పాటు రోజూ కాయకోత చేపట్టవచ్చు. ఒక ఏడాదిలో ఒక ఎకరాకు 7.5 టన్నుల కాయ దిగుబడి వస్తుంది. కిలో రూ.30 నుంచి రూ.35 చొప్పున కాయలను విక్రయించుకోవచ్చు. తద్వారా ఎకరాకు రూ.2.25,000 ఆదాయం వస్తుంది. ఖర్చులు రూ.56,400 పోను ఎకరాకు ఏడాదికి రూ.1,68,600 నికరాదాయం లభిస్తుంది. వర్షాకాలం, చలికాలంలో ఎర్రని మచ్చలతో ఆకు అంతా వ్యాపించి ఆకు ఎండేటట్లు చేసే కుంకుమ తెగులు పట్ల జాగ్రత్తగా ఉండాలి. దీని నివారణకు నీటిలో కరిగే మూడు గ్రాముల గంధకాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. డ్రై అంజూరకు .. దయానాతెలంగాణ రాష్ట్రంలోని భూములు పూనా, బ్రౌన్ టర్కీ, దయానా రకాల సాగుకు అనుకూలం. పూనా: కాయలు గంట ఆకారంలో, మధ్యస్థంగా ఉండి, 42 గ్రా. వరకు బరువు ఉంటాయి. పలుచని తోలుతో లేద ఊదా రంగు కలిగి, గుజ్జు ఎర్రగా ఉండి మంచి సువాసన కలిగి ఉంటాయి. కిలోకి 20-30 కాయలు తూగుతాయి.బ్రౌన్ టర్కీ: ముదురు రంగులో పెద్దగా ఉంటాయి. నిల్వసామర్థ్యం ఎక్కువ. కోసిన వారం రోజుల వరకు పాడవకుండా ఉంటాయి. కిలోకి 14-18 కాయలు తూగుతాయి.దయానా: లేత ఆకుపచ్చ రంగులో ఉండి పక్వానికి వచ్చాక లేత పసుపు రంగులోకి మారి మధురమైన రుచిని కలిగి ఉంటుంది. ఈ రకం పచ్చిపండుగానే కాక డ్రై ఫ్రూట్స్ తయారీకి అనువైనది.అంజూరకు భలే గిరాకీ దేశంలో అంజూర వినియోగం బాగా పెరిగింది. తెగుళ్ళు తక్కువగా ఉండటం, లాభాలు అధికంగా ఉండడంతో రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెడుతున్నారు. మొక్కలు, సాగు విధానాల కోసం నెం. 94411 68156లో సంప్రదించవచ్చు.

# గోధుమ రొట్టెలు బరువును తగ్గిస్తాయా?

గోధుమ రొట్టెలు బరువును తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ముడి బియ్యం కంటే కూడా జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాల్లో మాంసకృత్తులు, పీచు పదార్థాలు ఎక్కువగా వుంటాయి. కాస్త తినగానే కడుపు నిండిన భావన ఏర్పడుతుంది. అందుచేత ఆకలి వుండదు. అయితే రొట్టెలు, ముడి బియ్యం, కొర్ర బియ్యం%ౌ% ఏదైనాసరే వాటితో పాటు తీసుకునే కూర, పప్పు పరిమాణాన్ని బట్టి కూడా బరువు తగ్గడం అనేది ఆధారపడి ఉంటుంది. ప్రతి ధాన్యంలో దానికే ప్రత్యేకమైన కొన్ని పోషకాలు ఉంటాయి.కాబట్టి ఒకే ధాన్యపు వంటకాన్ని రోజూ తినకుండా, అన్ని రకాల ధాన్యాలనూ తీసుకోవాలి. దీంతో పాటు ఆకుకూరలు, కాయకూరలు ఎక్కువగా తినడం మంచిది. ఇంకా వెన్న తీసిన పాలు, పెరుగు వినియోగించాలని. దీంతో పాటు శారీరక వ్యాయామం చేయాలి. తగినంత నిద్రపోవాలని న్యూట్రీషియన్లు అంటున్నారు.ఇంకా ఆహారంలో కాల్షియం ఉండేలా చూసుకోవాలి. కాల్షియం వల్ల శరీరంలో ఉన్న కణజాలం కూడా ఉత్తేజంగా పనిచేస్తుంది. పాలు, పెరుగు, పనీర్, కోడిగుడ్లు, పాలకూర, క్యాబేజీ, కాలిఫ్లవర్ తదితరాల్లో కాల్షియం మనకు పుష్కలంగా లభిస్తుందని, ఎముకల బలంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని న్యూట్రీషియన్లు చెప్తున్నారు.



# 'అప్పడం'గా తినండి


ఏదో అప్పడమనీ... సైడ్ డిష్ అనీ ఇన్నాళ్లు సైడ్ ప్లేటులో పెట్టిన వాళ్లు ఇప్పుడు మెయిన్ కోర్సులోకి దించి అప్పనంగా తినండి! ఇది అప్పడం భోజనం!దహీ పాపడ్ కీ సబ్జీ కావలసినవి: నూనె - 4 టీ స్పూన్లుబీ ఆవాలు - అర టీ స్పూనుబీ జీలకర్ర - అర టీ స్పూనుబీ ఇంగువ - కొద్దిగాబీ కరివేపాకు - 2 రెమ్మలుబీ ఉల్లి తరుగు - పావు కప్పుబీ అల్లం వెల్లుల్లి ముద్ద - ఒక టీ స్పూనుబీ పసుపు - అర టీ స్పూనుబీ పచ్చి మిర్చి - 1 (పొడవుగా నిలువుగా కట్ చేయాలి)బీ మిరప కారం - ఒక టీ స్పూనుబీ ధనియాల పొడి - అర టీ స్పూనుబీ నీళ్లు - ఒక కప్పుబీ పెరుగు - ఒక కప్పుబీ అప్పడాలు - 5బీ ఉప్పు - తగినంతబీ కసూరీ మేథీ - 2 టేబుల్ స్పూన్లుబీ గరం మసాలా - ఒక టీ స్పూనుబీ కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు.

తయారీ:✓స్టౌ మీద బాణలిలో 4 టేబుల్ స్పూన్ల నూనె వేడయ్యాక ఆవాలు వేసి చిటపటలాడించాలి✓జీలకర్ర, ఇంగువ, కరివేపాకు వేసి మరోమారు వేయించాలి. ✓ఉల్లి తరుగు జత చేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి✓అల్లం వెల్లుల్లి ముద్ద, పచ్చి మిర్చి వేసి మరోమారు వేయించాలి✓పసుపు, మిరప కారం, ధనియాల పొడి వేసి మరోమారు వేయించాలి✓కప్పు నీళ్లు, కప్పు చిలికిన పెరుగు వేసి కలపాలి✓సన్నని మంట మీద పదార్థాలన్నీ కలిసేవరకు కలుపుతుండాలి✓అప్పడం ముక్కలను ఇందులో వేసి, కొద్దిగా ఉప్పు జత చేసి రెండు నిమిషాలు ఉడికించాలి✓గరం మసాలా, కసూరీ మేథీ జత చేసి బాగా కలిపి దింపేయాలి.మేథీ పాపడ్‌కర్రీ కావలసినవి: మెంతులు - 3 టేబుల్ స్పూన్లుబీపెరుగు - 3 టేబుల్ స్పూన్లుబీ మినప అప్పడాలు - 4బీ ధనియాల పొడి - 3 టీ స్పూన్లుబీ మిరప కారం - 2 టీ స్పూన్లుబీ పసుపు - ఒక టీ స్పూనుబీ ఉప్పు - తగినంత.తయారీ:✓స్టౌ మీద పెద్ద పాత్రలో రెండు కప్పుల నీళ్లు మరిగించి దింపేయాలి✓మెంతులు వేసి మూత పెట్టి అరగంట సేపు పక్కన ఉంచాలి✓స్టౌ మీద చిన్న బాణలిలో నూనె వేసి కాగాక అప్పడాలు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి✓మిక్సీలో... పెరుగు, ధనియాలు, మిరప కారం, పసుపు వేసి మెత్తగా చేసి, స్టౌ మీద బాణలిలో ఉన్న నూనెలో వేసి వేయించాలి ✓మెంతులలోని నీళ్లు తీసేసి, ఉడుకుతున్న పెరుగు మిశ్రమంలో వేసి రెండుమూడు నిమిషాలు కలియబెట్టాలి✓ఒక కప్పు నీళ్లు జత చేసి మరిగించాలి✓అప్పడం ముక్కలను ఇందులో వేసి కలిపి దింపేయాలి. (పచ్చి అప్పడాలను కూడా ఉపయోగించుకోవచ్చు)✓అన్నంలోకి, చపాతీలలోకి రుచిగా ఉంటుంది. (మధుమేహ వ్యాధి ఉన్నవారికి ఇందులోని మెంతులు ఔషధంలా పనిచేస్తాయి.పాపడ్ పోహా కావలసినవి: అప్పడాలు - 8బీ అటుకులు - ఒక కప్పుబీ నూనె - డీప్ ఫ్రైకి సరిపడాబీ ఉప్పు - తగినంతబీ మిరప కారం - ఒక టీ స్పూనుబీ ఇంగువ - పావు టీ స్పూను.తయారీ:✓స్టౌ మీద బాణలి వేడయ్యాక నూనె పోసి కాగాక, అప్పడాలు వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి✓అప్పడాలను చేతితో పొడి చేయాలి✓ఒక పాత్రలో అప్పడాల పొడి, అటుకులు, ఉప్పు, మిరప కారం, ఇంగువ వేసి బాగా కలిపి, గాలి చొరని డబ్బాలో నిల్వ ఉంచుకోవాలి.స్టఫ్డ్ పాపడ్ రోల్స్ కావలసినవి: పసుపు - అర టీ స్పూనుబీ మిరప కారం -అర టీ స్పూనుబీ ధనియాల పొడి - ఒక టీ స్పూనుబీ ఆమ్‌చూర్ - అర టీ స్పూనుబీ జీలకర్ర - ఒక టీ స్పూనుబీ సన్నగా తరిగిన పచ్చి మిర్చి - 1బీ అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టేబుల్ స్పూనుబీ మైదా పిండి - ఒక టేబుల్ స్పూనుబీ కొత్తిమీర తరుగు - 3 టేబుల్ స్పూన్లుబీ పచ్చి బఠాణీ - పావు కప్పుబీ ఉడికించి, మెత్తగా మెదిపిన బంగాళ దుంప - రెండు కప్పులుబీ ఉప్పు - తగినంతబీ నూనె - డీప్ ఫ్రైకి సరిపడాబీ చిన్న సైజు అప్పడాలు - 10.తయారీ:✓ఒక పాత్రలో మైదా పిండి, కొద్దిగా నీళ్లు పోసి దోసెల పిండి మాదిరిగా కలిపి పక్కనుంచాలి✓స్టౌ మీద బాణలిలో ఒక టేబుల్ స్పూను నూనె వేసి కాగాక, జీలకర్ర వేసి చిటపటలాడించాలి✓అల్లం వెల్లుల్లి ముద్ద వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి✓పచ్చి బఠాణీ, ఉడికించి మెదిపిన బంగాళ దుంప, ఉప్పు, పసుపు, మిరప కారం, ధనియాల పొడి, ఆమ్ చూర్ పొడి వేసి కలపాలి ✓ఒక్కో అప్పడాన్ని చల్ల నీళ్లలో 30 సెకన్ల పాటు ఉంచి తీసేయాలి ✓అప్పడం మెత్తగా ఉన్నప్పుడే బంగాళ దుంప మిశ్రమం కొద్దిగా తీసుకుని అప్పడానికి ఒక చివర ఉంచి, జాగ్రత్తగా రోల్ చేసి, అంచులను మైదా పిండితో మూసేయాలి✓ఈ విధంగా అన్నీ చేసుకోవాలి✓స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారుచేసి ఉంచుకున్న పాపడ్ రోల్స్‌ను అందులో వేసి కరకరలాడే వరకు వేయించాలి ✓కిచెన్ టవల్ మీదకు తీసుకోవాలి✓గ్రీన్ చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.స్వీట్ అండ్ టాంగీ మసాలా పాపడ్ చాట్ కావలసినవి: ఉల్లి తరుగు - పావు కప్పుబీ ఉడికించిన బంగాళ దుంప - అర కప్పుబీ టొమాటో తరుగు - పావు కప్పుబీ గ్రీన్ చట్నీ - 2 టీ స్పూన్లుబీ స్వీట్ చట్నీ - 2 టీ స్పూన్లుబీ ఉప్పు - తగినంతబీ మిరప కారం - పావు టీ స్పూనుబీ మిక్చర్ - రెండు కప్పులుబీ కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లుబీ చాట్ మసాలా - అర టీ స్పూనుబీ నిమ్మ రసం - అర టీ స్పూనుబీ పచ్చి అప్పడాలు - 4 (మధ్యకు రెండు ముక్కలుగా కట్ చేయాలి)తయారీ:✓స్టౌ మీద నాన్ స్టిక్ పాన్ ఉంచి, నూనె వేయకుండా, అప్పడాలను పేపర్ నాప్‌కిన్‌తో ఒత్తుతూ కాల్చి కోన్ ఆకారంలో చుట్టాలి (వేడిగా ఉన్నప్పుడే కోన్ ఆకారంలో చుట్టినప్పుడు అంచులు అవే అతుక్కుంటాయి✓ఈ విధంగా అన్నీ చేసుకుని పక్కన ఉంచుకోవాలి ✓ఒకపాత్రలో ఉడికించిన బంగాళ దుంప ముక్కలు, ఉల్లి తరుగు, టొమాటో తరుగు, మిక్చర్, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరప కారం, చాట్ మసాలా, నిమ్మ రసం, స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీ అన్నీ వేసి బాగా కలపాలి✓తయారుచేసి ఉంచుకున్న కోన్‌లో ఈ మిశ్రమాన్ని ఉంచి, చాట్ మసాలా చల్లి అందించాలి ' స్నాక్‌లా చాలా రుచిగా ఉంటుంది.కేరళ స్టైల్ పాపడ్ కర్రీ కావలసినవి: బంగాళ దుంప ముక్కలు - ఒక కప్పుబీ కేరళ అప్పడాలు - 10బీ ఉల్లి తరుగు - ఒక కప్పుబీ అల్లం ముద్ద - ఒక టీ స్పూనుబీ తరిగిన పచ్చి మిర్చి - 2 బీ పసుపు - అర టీ స్పూనుబీ మిరప కారం - 2 టీ స్పూన్లుబీ ఇంగువ - కొద్దిగాబీ ధనియాల పొడి - ఒక టీ స్పూనుబీ ఉప్పు - తగినంతబీ ఆవాలు - ఒక టీ స్పూనుబీ నూనె - డీప్ ఫ్రైకి సరిపడాబీ కొబ్బరి నూనె - 3 టీ స్పూన్లు (పోపు కోసం).తయారీ:✓స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, అప్పడాలు వేయించి తీసి పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి✓అదే బాణలిలో బంగాళ దుంప ముక్కలు వేసి కరకరలాడేవరకు వేయించాలి✓స్టౌ మీద చిన్న బాణలిలో కొబ్బరి నూనె వేసి కాగాక ఆవాలు వేసి చిటపటలాడించాలి ✓ఇంగువ, పచ్చి మిర్చి తరుగు, అల్లం ముద్ద వేసి బాగా కలపాలి✓ఉల్లి తరుగు జత చేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి✓మిరప కారం, పసుపు, ధనియాల పొడి జత చేసి మరోమారు కలియబెట్టాలి ✓వేయించుకున్న బంగాళ దుంప ముక్కలు, అప్పడం ముక్కలు వేసి కలిపి దింపేయాలి✓ఈ కూర అన్నంలోకి రుచిగా ఉంటుంది✓స్నాక్‌లాగ కూడా తినొచ్చు.



# బంగాళదుంప" లో ఇన్ని సౌదర్య గుణాలు ఉన్నాయా..!!!!

సహజ అందానికి మనచుట్టూ ప్రకృతిలో ఉండే చెట్లో , పూలో ఎంతగానో ఉపయోగపడుతూ ఉంటాయి. రోజు వారి మనం వాడుకునే కూరగాయలు సైతం అందం రెట్టింపు చేయడంలో కీలకంగా ఉంటాయి. అయితే బంగాళదుంప సైతం అందాన్ని రెట్టింపు చేయడంలో ఉపయోగపడుతుందనే విషయం చాలా మందికి తెలియదు. బంగాళదుంప కేవలం రుచికి మాత్రమే కాదు, ముఖంపై ఏర్పడే నల్ల మచ్చలని తొలగించడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. మరి బంగాళదుంపని ఉపయోగించి నల్లమచ్చలకి ఎలా చెక్ పెట్టచ్చో ఇప్పుడు చూద్దాం.. పచ్చిగా ఉండే బంగాల దుంపలో ఉండే కొన్ని ఎంజైమ్స్ అధికంగా వచ్చే మెలినిన్ నివారించడంలో ఉపయోగ పడుతుంది. దాంతో చర్మంపై ఉండే మచ్చలు త్వరితగతిన పోవడంలో సహాయపడుతుంది. అయితే మచ్చలని తొలగించడానికి బంగాల దుంపని ఎలా ఉపయోగించాలంటే. ముందుగా ఓ పచ్చి బంగాళదుంప తీసుకుని దానిని రెండు ముక్కలుగా చేయాలి. ఈ ముక్కల పై భాగంలో కొంచం నీళ్ళు చిలకరించి తడి చేయాలి. ఐదు నిమిషాలు అయిన తరువాత కోసిన బంగాళదుంప ముక్కలని తీసుకుని మచ్చలు ఉన్న ప్రదేశంలో గుండ్రంగా రుద్దాలి. ఇలా రోజుకి రెండు సార్లు వారానికి మూడు రోజులు చేయటంవలన తప్పకుండ నల్లమచ్చలని ముఖంపై నుంచీ తీసేయచ్చు. కేవలం నల్ల మచ్చలు పోవడమే కాకుండా చర్మం నాజూకుగా ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది.



# డైట్ చేస్తున్నవారు పాలు మానేయాలా?

పాలు ప్రతిరోజూ మనం తీసుకునే పౌష్టికాహారం. ఎందుకంటే పాలలో దాదాపుగా అన్ని పోషకాలు సమపాళ్లలో ఉంటాయి. పాలు దానికదే ఒక బ్యాలెన్స్‌డ్ డైట్ లాంటిది. ఐరన్, విటమిన్ సి తప్ప మిగిలిన అన్ని పోషకాలుంటాయి. సో.. పాలు తాగడం వల్ల చాలా పోషకాలు మనకు అందుతాయి. పాలలో ఉండే పోషకాలు హై బయోలాజికల్ వాల్యూ కలిగి ఉంటాయి. అంటే పాలలో ఉన్న అన్ని పోషకాలు వంద శాతం మనకు లభ్యమవుతాయి. ప్రొటీన్, కార్బోహైడ్రేట్ ఫ్యాట్స్, కాల్షియం, బి విటమిన్, ఫ్యాట్ సోల్యుబుల్ విటమిన్స్ మొదలైనవి పాలలో ఉంటాయి.పాలు తాగడం వల్ల.పెరిగే పిల్లలు పాలు తాగడం వల్ల ఎముకలు పొడువుగా, మందంగా పెరిగి గట్టిపడతాయి. ఆర్యోగంగా పెరుగుతారు.గర్భవతులు పాలు తాగడం వల్ల పిండం వృద్ధి బాగుంటుంది.పాలిచ్చే తల్లులు పాలు తాగడం వల్ల వారి ఎముకల నుంచి పోయిన కాల్షియం తిరిగి చేరుతుంది. నడుం నొప్పి, ఎముకల గుల్లదనం రాకుండా ఉంటుంది. సామాన్యులు నిద్రకు ఉపక్రమించే ముందు పాలు తాగడం వల్ల నిద్ర బాగా పడుతుంది. బి12, విటమిన్ డి లోపాలు రాకుండా చేస్తుంది.మహిళలు మెనోపాజ్ దశలో పాలు తాగడం చాలా అవసరం. దీనివల్ల ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. పాలుపడని వారి మాటేమిటి?అలాంటివారు పాలు మానేయాల్సిందే. పాలకు బదులు పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు. పనీర్ చీజ్, పెరుగు, మజ్జిగ ప్రతిరోజూ తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. పెరుగు, మజ్జిగల్లో మంచి బ్యాక్టీరియా కూడా తోడవుతుంది కాబట్టి ఇవి ఆరోగ్యానికి మరింత మంచిది.ఫ్యాట్ పర్సెంట్ ఎంత ఉండాలి? పాలు వీలైనంత నార్మల్‌గా తీసుకోవాలి. అంటే ఫుల్ ఫ్యాట్ ఉన్న పాలన్నమాట. ఇలా తీసుకోవడం వల్ల విటమిన్ ఎ, డి, ఈ,కెలను కోల్పోకుండా ఉంటాము. బాబోయ్ ఫ్యాట్ అని భయపడాల్సిన అవసరం లేదు. పాలలో ఏమీ కలపకుండా నార్మల్‌గా తీసుకుంటే మంచిది. పసులు, మిరియాలు, పంచదార, ఇతర సప్లిమెంట్స్ అవసరాన్ని బట్టి మాత్రమే వాడాలి. డైట్ చేస్తున్నవారు పాలు మానేయాలా? బరువు తగ్గాలనుకున్నవారు పాలు మానాల్సిన అవసరం లేదు. నిజానికి పాలతో వివిధ రకాల మిల్క్‌షేక్స్ చేసుకుని, భోజనానికి బదులుగా తీసుకోవచ్చు. ఎటువంటి పోషకలోపం రాకుండా డైట్ చెయ్యొచ్చు. పాలు జీర్ణమవడానికి సమయం పడుతుంది. కాబట్టి ఆకలిని కూడా తగ్గిస్తాయి.

# మునక్కాయ మటన్

కావల్సినవి: మాంసం ముక్కలు - కప్పు, ఉల్లిపాయ, టొమాటో - ఒక్కోటి చొప్పున వెల్లుల్లి రెబ్బలు - ఐదు, అల్లం తరుగు - చెంచా, పసుపు - అరచెంచా, కారం - చెంచా, నూనె - పావుకప్పు, కరివేపాకు రెబ్బలు - రెండు, పచ్చిమిర్చి -నాలుగు, ధనియాలపొడి - చెంచా, మునక్కాయలు - రెండు, నిమ్మరసం - చెంచా, కొత్తిమీర - కట్ట, ఉప్పు- తగినంత. తయారీ: పొయ్యిమీద బాణలి పెట్టి.. నూనె వేయాలి. అది వేడయ్యాక ఉల్లిపాయముక్కలూ, ఎండుమిర్చీ కరివేపాకు వేయాలి. అవి ఎర్రగా వేగాక మాంసం ముక్కలూ, మునక్కాయ ముక్కలు వేసి మంట తగ్గించాలి. ఐదారు నిమిషాలయ్యాక మూత పెట్టేయాలి. కాసేపటికి ఈ రెండూ ఉడుకుతాయి. అప్పుడు అల్లం, వెల్లుల్లి తరుగూ, టొమాటో ముక్కలూ, ఉప్పూ, కారం, పసుపూ, కాసిని నీళ్లు పోసి కలపాలి. మంట తగ్గించి మధ్యమధ్య కలుపుతూ ఉంటే.. కాసేపటికి నీళ్లన్నీ ఆవిరైపోతాయి. అప్పుడు ధనియాలపొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి దింపేయాలి.

# ప్రపంచంలోనే మొదటి ట్రిలియనీర్ ఎవరు? అదానీ, అంబానీలకు చాన్స్ ఉందా?



ప్రపంచంలో అత్యధిక ధనవంతులు ఎవరనే విషయంపై అందరికీ ఆసక్తి ఉంటుంది. ఆ జాబితాలో అనేక మంది వ్యాపార దిగ్గజాల పేర్లు మనకు వినిపిస్తాయి. వారి సంపద విషయంలో కొన్నిసార్లు హెచ్చుతగ్గులుంటాయి. జాబితాలో స్థానాలు మారుతూ ఉంటాయి. అయినప్పటికీ మనందరికీ వారిపై ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. మన దేశానికి చెందిన గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీలు అత్యధిక ధనవంతుల జాబితాలో ఎప్పుడూ కనిపిస్తారు. ప్రపంచంలో ఇప్పుడు అందరూ ధనవంతులూ బిలియనీర్లే. ట్రిలియనీర్ స్థాయికి ఇంకా ఏ ఒక్కరూ ఎదగలేదు. కాబట్టి ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ ఎవరు అవుతారనే విషయంపై చర్చ జరుగుతోంది. అత్యధిక ధనవంతులైన ఎలాన్ మస్క్, గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ లలో ఎవరికీ అవకాశం ఉందో తెలుసుకుందాం.

నివేదిక ప్రకారం..

ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ ఎవరు అవుతారనే విషయంపై ఇటీవల ఓ నివేదిక విడుదలైంది. ప్రస్తుతం ధనవంతులైన పలువురి ఆస్తుల పెరుగుదలను ఆధారంగా చేసుకుని అంచనా వేసింది. ఆ నివేదిక ప్రకారం స్పేస్ ఎక్స్ సంస్థ సీఈవో అయిన ఎలోన్ మాస్క్ 2027 నాటికి ట్రిలియనర్ గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన సంపద పెరుగుతున్న తీరు అలాగే కొనసాగితే మస్క్ ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ గా రికార్డు నెలకొల్పుతారు. ఇప్పటికే ఆయన 237 బిలియన్ల యూఎస్ డాలర్ల నికర విలువతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్నారు.

2028లో గౌతమ్ అదానీ..

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి కూడా ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన సంపద పెరుగుతున్న లెక్కప్రకారం 2028 నాటికి ఆ ఘనత సాధిస్తారు. ప్రస్తుతం అదానీ షేర్ సంపద 100 బిలియన్ డాలర్ల కన్నా తక్కువే. సంపద విషయంలో ఆయన 13వ స్థానంలో కొనసాగుతున్నారు. ఆయన సంపద 123 శాతం చొప్పున పెరుగుతోంది. ఇదే కొనసాగితే 2028 నాటికి ట్రిలియనీర్ అవుతారు.

2033లో ముఖేష్ అంబానీ..

రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కూడా ట్రిలియనీర్ అయ్యే జాబితాలో ఉన్నారు. ఈయన సంపద సగటున 28.25 శాతం వార్షిక రేటుతో పెరుగుతోంది. ఇదే కొనసాగితే 2033 నాటికి ఆయనకు ట్రిలియనీర్ అయ్యే అవకాశం లభిస్తుంది. వీరితో పాటు ప్రపంచంలోని ప్రముఖులైన జెన్ సన్ హువాంగ్, ప్రజోగో పాంగ్టెస్టు, బెర్నార్డ్ ఆర్నాల్డ్, మార్క్ జూకర్ బర్గ్ తదితరులు కూడా ట్రిలియనీర్ జాబితాలో చేరే అవకాశం ఉంది.

ట్రిలియనీర్ అంటే..

ఒక బిలియన్ డాలర్ అంటే 8500 కోట్ల రూపాయల సంపద కలిగిన వారిని బిలియనీర్లు అంటారు. ట్రిలియనీర్ కావాలంటే లక్ష కోట్ల డాలర్ల సంపద ఉండాలి. అంటే 85 లక్షల కోట్ల విలువైన ఆస్తిని సంపాదించాలి. ప్రస్తుతం ఎలోన్ మస్క్ ఆస్తి విలువ 251 బిలియన్ డాలర్లు. ఆయన సంపద 110 శాతం రేటులో పెరుగుతోంది. ఇదే కొనసాగితే ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రిలియనీర్ గా మారతారు. ప్రపంచంలో మొదటి ట్రిలియనీరు ఎవ్వరు అవుతారనే విషయంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# 10 గ్రాముల బంగారం ధర రూ.25,000.. ఈ మ్యాజిక్ వెనుక లాజిక్ ఇదే!




తులం బంగారం దాదాపు 25 వేల రూపాయిలే. ఈ మాట వినడానికి చాలా హాయిగా ఉంటుంది. వెంటనే ఫేస్ లో అవునా అనే ఎక్స్ప్రెషన్ వస్తుంది. పది గ్రాముల బంగారం ధర 70 వేల రూపాయిలకు పైగానే ఉంది. మరి దాదాపు 25 వేల రూపాయిలకు ఎలా వస్తుంది అనుకోవచ్చు. కానీ ఇది నిజమే. ఇక్కడ రేటులో నెంబర్లు ఏమీ మారలేదు. కాకపోతే పుత్తడి ధరలు నానాటికీ భారీగా పెరుగుతుండడంతో కేంద్రప్రభుత్వం గోల్డ్ ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనుకుంటోంది. అందుకే తక్కువ క్యారెట్ల బంగారాన్ని అమ్మడానికి ఆలోచిస్తోంది. అంటే.. 24 క్యారెట్లు, 22 క్యారెట్లకు బదులు.. 9 క్యారెట్లన్న మాట. క్యారెట్ ఎప్పుడు తగ్గిందో.. దాని రేటు కూడా ఆటోమేటిగ్గా తగ్గిపోతుంది.

9 క్యారెట్ల 10 గ్రా. బంగారం ధర..

9 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర.. దాదాపు 25 వేల నుంచి 30 వేల మధ్యలో ఉండే అవకాశముంది. అసలు ఈ ప్రయత్నం ఎంతవరకు సక్సెస్ అవుతుంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వచ్చే ఛాన్సుంది? ముఖ్యంగా మహిళలు తక్కువ క్యారెట్ బంగారాన్ని ఆదరిస్తారా? రేటు పరంగా ఇది బంగారం లాంటి ఆఫర్ అని మధ్యతరగతివారు భావిస్తున్నారా? అసలు ఓవరాల్ గా 9 క్యారెట్ల గోల్డ్%ొ% బంగారం పరిశ్రమపై ఎలాంటి ప్రభావం చూపించబోతోంది? ఆభరణాల తయారీలో 22, 18 క్యారెట్ల బంగారాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. అయినా సరే.. మన దేశంలో 24 క్యారెట్ల గోల్డ్ కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ దీనిని కొందామంటే.. సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంది. 10 గ్రాముల బంగారం ధర దాదాపు 73 వేల రూపాయిలు ఉంది. త్వరలో లక్ష రూపాయిలు చేరుతుందని అంటున్నారు. ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా తక్కువేమీ లేదు. 10 గ్రాములు దాదాపు 67 వేల రూపాయిలు ఉంది. 18 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర చూస్తే.. దాదాపు 55 వేల రూపాయిలు ఉంది. అంటే కనీసం 10 గ్రాముల బంగారాన్ని కొనాలన్నా.. దీనికోసం రెండు, మూడు నెలల సంపాదనను ఖర్చు పెట్టాల్సిన వారే ఎక్కువ. అందుకే.. కేంద్రం.. మధ్య, దిగువతరగతి వర్గాల వారికీ అందుబాటులో ఉండేలా తక్కువ ధరకే బంగారం లభ్యమయ్యేలా ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. దీనికోసం 9 క్యారెట్ల గోల్డ్ ను తీసుకువస్తే.. దాని 10 గ్రాముల విలువ 30 వేల రూపాయిల లోపే ఉంటుంది. దీంతో ఎక్కువమంది ఈరకం పుత్తడిని కొనడానికి అవకాశం లభిస్తుంది. దీంతో సామాన్యుడికి కూడా బంగారం కొనే స్థోమత కలుగుతుంది. అలాగని.. 22, 24 క్యారెట్ల గోల్డ్ కు డిమాండ్ తగ్గుతుందని చెప్పలేం. దేని డిమాండ్ దానిదే. బంగారం స్వచ్ఛతను హాల్ మార్క్, బీఎస్ఐ ముద్రలను బట్టి చూస్తారు. సో.. ఇప్పుడు 9 క్యారెట్స్ గోల్డ్ ను కాని తీసుకువస్తే.. దాని క్వాలిటీని సూచించేలా హాల్ మార్క్, బీఎస్ఐ ముద్రలు వేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఇలా ధృవీకరణ ఉంటేనే.. ఆ బంగారానికి విలువ ఉంటుంది. ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. ఇక్కడి వరకు బాగానే ఉంది. ఇంతకీ ప్రభుత్వం.. 9 క్యారెట్ల గోల్డ్ ను ఎందుకు తీసుకురావాలనుకుంటోంది? ఇది కూడా ముఖ్యమైన పాయింట్. నిజానికి మధ్య, దిగువ తరగతి వారికి 9 క్యారెట్ గోల్డ్ వల్ల ఉపశమనం కలుతుంది అనుకున్నా.. ప్రభుత్వం దీనిని తీసుకురావడం వెనుక మరో కారణం కూడా లేకపోలేదు. బంగారం విలువ నానాటికీ పెరిగేదే. అందుకే దొంగల చూపంతా ముందు బంగారం మీదే ఉంటుంది. మార్కెట్ లో గోల్డ్ ఆర్నమెంట్స్ విలువ ఎక్కువగా ఉండడంతో గొలుసు దొంగల ఫోకస్ అంతా.. మహిళల మెడలో ఉండే ఆభరణాలపైనే ఉంటుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ దొంగతనాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో బాధితుల ప్రాణాలు పోయే ప్రమాదమున్నా సరే.. గొలుసుదొంగలు ఏమాత్రం కనికరం చూపించరు. 9 క్యారెట్ల గోల్డ్ ను తీసుకువస్తే.. ఈ దొంగతనాల సంఖ్య తగ్గే అవకాశముందన్న వాదనా లేకపోలేదు. ఓసారి ఎన్సీఆర్బీ స్టాటిస్టిక్స్ చూస్తే.. అసలు విషయం అర్థమవుతుంది. గొలుసు దొంగతనాల కేసులు చూస్తే.. 2021తో పోలిస్తే.. 2022కి 32.54 శాతం పెరిగాయి. అంటే కేసుల్లో దాదాపు మూడో వంతు పెరుగుదల కనిపించింది. అందుకే మహిళలు బంగారు ఆభరణాలను ధరించడానికే భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో పుత్తడి వినియోగదారుల దృష్టి.. తక్కువ క్యారెట్లు ఉన్న బంగారం.. అంటే 9 క్యారెట్ల గోల్డ్ పై పడింది. దీంతో ప్రభుత్వం కూడా ఈ చవక బంగారం విషయంలో త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ దీనికి హాల్ మార్క్ కాని వేస్తే.. వినియోగదారుల నుంచి ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశముంది. దీంతోపాటు హాల్ మార్కింగ్ యునిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్స్ కూడా అవసరం. ప్రస్తుతం.. 14, 18, 22 క్యారెట్ల బంగారానికి మాత్రమే నెంబర్ తో హాల్ మార్క్ వేస్తున్నారు. 9 క్యారెట్ల గోల్డ్ ఆభరణాలు మార్కెట్లోకి వస్తే.. వాటికి డిమాండ్ ఎలా ఉంటుందో, ఏమేరకు వినియోగదారులు వాటిని ఆదరిస్తారో చూడాలి. 9 క్యారెట్ల బంగారం ధరపై 3 శాతం జీఎస్టీ ఉంటుంది. గోల్డ్ రేటుకు జీఎస్టీ కలిపినా కలిపినా.. 10 గ్రాముల బంగారం ధర 30 వేల రూపాయిల లోపే ఉంటుంది. ఈరేటు ఆరోజున మార్కెట్ లో ఉన్న ధరపై ఆధారపడి ఉంటుంది. నిజానికి 9 క్యారెట్ గోల్డ్ కు హాల్ మార్కింగ్, %ఎఖ×ణ% నెంబర్ ల ముద్రణకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి, బంగారం వర్తక సంఘాలకు మధ్య కొన్ని సమావేశాలు జరిగాయి. ఒకవేళ హాల్ మార్కింగ్ కాని ఉంటుంది అంటే.. వినియోగదారులు.. తక్కువ ఖర్చులోనే భారీ బంగారు ఆభరణాలను కొనడానికి ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే గోల్డ్ రేటు ఎక్కువగా ఉంటే.. సాధారణ కొనుగోలుదారులు దీనిని కొనడానికి వెనుకంజ వేస్తారు. శుభకార్యాలు, వివాహాలకు సంబంధించి అవసరాల మేరకు మాత్రమే పుత్తడిని కొంటారు. అలా కాకుండా ధర కాని అందుబాటులో ఉంటే.. పెద్దమొత్తంలో బంగారు వస్తువులు కొనడానికి ఇంట్రస్ట్ చూపిస్తారంటున్నారు బంగారు వర్తకులు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలతో బంగారం ధర రానురాను పెరుగుతుందే కాని తగ్గే అవకాశం లేదంటున్నారు నిపుణులు. అందుకే.. మన దేశంతోపాటు మరికొన్ని దేశాలు కూడా బంగారాన్ని భారీగా కొనే పనిలో పడ్డాయి. ఈ విధంగా తమ పోర్ట్ ఫోలియోలో బంగారాన్ని ఎక్కువగా యాడ్ చేసుకుంటున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఇజ్రాయిల్–గాజా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలు తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయి. వీటివల్ల గోల్డ్ రేటు కూడా ప్రభావితం అవుతోంది. అమెరికా ఆర్థికవ్యవస్థ పరిస్థితిని చూస్తే.. రాబోయే కాలంలో డాలర్ విలువ తగ్గే అవకాశముంది. అందుకే ఎక్కువమంది బంగారంపై ఫోకస్ పెట్టారంటున్నారు. దీంతో విదేశీ నిల్వలను పెంచుకోవడం కోసం మన దేశం కూడా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందుకే డాలర్ కు బదులుగా బంగారాన్ని పెద్ద ఎత్తున సమకూర్చుకునే ప్లాన్ లో ఉంది. ఒకవేళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు ఎక్కువైతే.. కరెన్సీ విలువ తగ్గుతుంది. అంటే పరోక్షంగా బంగారం విలువ పెరిగినట్టే. దీనివల్లే చాలా దేశాలు గోల్డ్ కొనడానికి ముందుకొస్తున్నాయి. సగటు వినియోగదారుడి ఆలోచన కూడా ఇలాగే ఉంది. రూపాయి విలువ తగ్గినా పెరిగినా.. బంగారం విలువ మాత్రం పెరిగేదే కాని తగ్గేది కాదన్న అభిప్రాయంలో ఉన్నాడు. అందుకే తన పోర్ట్ ఫోలియోలో గోల్డ్ రిజర్వులను పెంచుకోవాలని భావిస్తున్నాడు. గోల్డ్ రేటు తగ్గితే.. మరింత ఎక్కువ బంగారం కొనడానికి ఆసక్తి చూపిస్తాడు.

# ఈ ఆరు దేశాల్లో వాట్సాప్‌పై నిషేధం.. దీని వెనుక ఉన్న కారణాలు ఏంటో తెలుసా..?




వాట్సాప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది వినియోగిస్తున్నారు. భారత్‌లోనూ 53కోట్ల మంది యూజర్లు ఉన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల కోసం వాట్సాప్‌ను ఉపయోగించుకుంటున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆరు దేశాల్లోని ప్రభుత్వాలు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌ని నిషేధించాయనే విషయం చాలా మందికి తెలియదు. ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఇందులో భారత్‌కు పొరుగుదేశమైన చైనాతో పాటు ఇరాన్, యూఏఈ, ఖతార్, సిరియా, ఉత్తర కొరియా ఉన్నాయి. ఈ దేశాలు తమ దేశాల్లో వాట్సాప్ వాడకాన్ని నిషేధించాయి. బ్యాన్ వెనుక కారణాలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉన్నాయి. అయితే, ఆయా దేశాలు ఎందుకు వాట్సాప్‌ని బ్యాన్ చేశాయో తెలుసుకుందాం.

ఉత్తర కొరియా..

వాట్సాప్‌ని బ్యాన్ చేసిన దేశాల్లో ఉత్తర కొరియా ఒక్కటి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఇంటర్నెట్ విధానాలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఉత్తర కొరియాలో సాధారణ ప్రజలకు ఇంటర్‌నెట్ వినియోగం పరిమితంగా అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వం కమ్యూనికేషన్‌పై నియంత్రణను కొనసాగిస్తుంది. ఈ క్రమంలో వాట్సాప్ సహా పలు యాప్‌ని వినియోగించకుండా నిషేధం విధించారు. తద్వారా స్థానిక సమాచారాన్ని బయటకు వెల్లడికాకుండా సమాచార వ్యాప్తిని అడ్డుకట్ట వేసేలా కిమ్ వాట్సాప్‌ని బ్యాన్ చేశారు.

చైనాలో..

భారత్‌కు పొరుగుదేశం చైనాలో దాదాపు పరిస్థితి కాస్త ఉత్తర కొరియా తరహాలోనే ఉంటుంది. ఇక్కడ ఇంటర్‌నెట్ వినియోగంపై ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుంది. చైనీస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని గ్రేట్ ఫైర్‌వాల్ పౌరులు బయటి ప్రపంచానికి సంబంధించిన అనేక విదేశీ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధిస్తుంది. విదేశీ యాప్‌లకు బదులుగా వుయ్‌చాట్ తదితర స్వదేశీ యాప్‌లను ప్రోత్సహించేందుకు చైనా ప్రభుత్వం సమగ్ర వ్యూహంపై పని చేస్తుంది. కమ్యూనికేషన్ నియంత్రించడంలో భాగంగా వాట్సాప్‌ని నిషేధించింది.

సిరియాలో..


వాట్సాప్‌ను సిరియాలోనూ నిషేధించారు. సిరియా చాలా కాలంగా అంతర్యుద్ధంతో పోరాడుతోంది. పైగా సిరియాపై అనేక ఆంక్షలు విధించారు. దీని కారణంగా సిరియాలో వాట్సాప్ నిషేధించబడింది. దేశంలో జరిగే విషయాలు బయటికి చేరడం ఇక్కడి ప్రభుత్వానికి సైతం ఇష్టం లేదు. అదే సమయంలో సమగ్ర ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ విధానంలో ఓ భాగంగా వాట్సాప్ నిషేధం కూడా భాగమే. ఇరాన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. అణుబాంబు విషయంలో ఇరాన్, అమెరికాల మధ్య వివాదం నడుస్తోంది. దీని కారణంగా వాట్సాప్ ఇరాన్‌లో ఎప్పటికప్పుడు ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయ అశాంతి దృష్ట్యా కమ్యూనికేషన్, సమాచార వ్యాప్తిని నియంత్రించడానికి అక్కడి ప్రభుత్వం వాట్సాప్‌ను కూడా నిషేధించింది.

# పెట్రో ధరల నుంచి ఉపశమనం : ఇంధన ధరల తగ్గింపునకు కసరత్తు




ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టడం, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు దిగివస్తాయనే అంచనాలు ఊపందుకున్నాయి. పెట్రేగుతున్న పెట్రో ధరల నుంచి ఉపశమనం కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వాహనదారులు, సామాన్యులకు ఈ వార్తలు ఊరట కలిగిస్తున్నాయి. అయితే దీర్ఘకాలం ముడిచమురు ధరలు దిగువస్థాయిలో నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు ఆయిల్ కంపెనీలు మొగ్గుచూపుతాయని పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ గురువారం పేర్కొన్నారు. చమురు ధరలు ఇటీవల మూడేండ్ల కనిష్ట స్థాయికి పడిపోవడంతో చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకత మెరుగుపడింది. దీంతో మహారాష్ట్ర, హరియాణ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు వెసులుబాటు కలిగింది. ఇక ఆర్థిక మందగమన ఇంధన డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందనే అంచనాతో బ్రెంట్ క్రూడ్ మంగళవారం ఏకంగా మూడేండ్ల కనిష్ట స్థాయిలో 70 డాలర్ల దిగువకు పడిపోయింది. మరోవైపు ముడిచమురు ధరలు దిగివస్తున్నా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పటికీ పలు నగరాల్లో లీటర్‌కు రూ . 100 దాటి పరుగులు పెడుతున్నాయి. ఇంధన ధరలు భగ్గుమంటుండటంతో ద్రవ్యోల్బణం పైపైకి వెళుతోంది. రవాణా వ్యయాలు పెరిగి కూరగాయలు సహా నిత్యావసరాల ధరలు మండుతున్నాయి. ధరలు తగ్గి ద్రవ్యోల్బణం దారికొచ్చి వృద్ధి రేటు ఊపందుకోవాలంటే ముందుగా భారమైన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని పరిశ్రమ వర్గాలతో పాటు ప్రజలు కోరుతున్నారు.


# మేకిన్ తెలంగాణే లక్ష్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 12 : రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మారెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సరిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హొటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికితీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సరిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కేసీపీ సిమెంట్స్, హెచ్ఏఎల్, మిథాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్శిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.




# టోవినో థామస్ నటించిన యాక్షన్ డ్రామా 'ఏఆర్ఎం' ఎలా ఉందంటే



మలయాళ నటుడు టొవినో థామస్ గురించి పరిచయం అక్కర్లేదు. ఆయన నటించిన పలు చిత్రాలు తెలుగులో విడుదలై విజయం సాధించగా, చక్కని గుర్తింపు తెచ్చుకున్నాడు. లూసిఫర్‌లో మోహన్‌లాల్‌కి తమ్ముడిగా, కేరళ వరదల నేపథ్యంలో తెరకెక్కిన '2018' చిత్రంతో అలరించాడు. 2021లో వచ్చిన 'మిన్నల్ మురళీ' చిత్రంతో మరింతగా ప్రేక్షకులకు చేరువయ్యాడు. తాజాగా టోవినో థామస్ నటించిన కొత్త సినిమా 'ఏఆర్ఎమ్' మలయాళంతో పాటు, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలైంది. టొవినో నటించిన 50వ చిత్రమిది. దీని కోసం తెలుగులోనూ ప్రమోషన్స్ బాగా చేశారు. మరీ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుందో చూద్దాం. అజయన్ (టోవినో థామస్) చియోతికావు ఊరిలో ఓ ఎలక్ట్రీషియన్. తన తాత మణియన్ చేసిన దొంగతనం తర్వాతి తరమైన అజయన్‌కు చుట్టుకుంటుంది. ఆ కారణంగా అతనికీ, అతని కుటుంబానికి ఆ గ్రామంలో గౌరవం ఇవ్వరు. ఊరిలో ఏ దొంగతనం జరిగినా పోలీసులు అజయ్‌ని అనుమానిస్తారు. కింజు కేలు (టోవినో థామస్) ధైర్య సాహసాలను మెచ్చి ఎడక్కల్ మహారాజు బహుమతిగా ఇచ్చిన మహిమాన్వితమైన శ్రీభూతి దీపం (అమ్మవారి ప్రతిమ) అజయ్ ఊరిలో ఉంటుంది. ఉత్సవాలు ప్రారంభం కావడానికి పది రోజులు ముందు అమ్మవారి విగ్రహాన్ని ఒకరు దొంగిలిస్తారు. ఆ దొంగతనం అజయ్ మీదకు నెట్టే ప్రయత్నం చేస్తారు. నిజమైన విగ్రహం ఎక్కడ ఉంది? మణియన్, కేలు ఏం చేశారు? ఊరిలో అసలు దొంగ ఎవరు? మరో పక్క గ్రామ పెద్ద అయిన పరము నంబియార్ కూతుర్ని అజయ్ ప్రేమిస్తాడు. ఆ విషయం తెలుసుకున్న నంబియార్ తక్కువ కులస్తుడైన అజయన్ తన బిడ్డను ప్రేమించడంపై పగ తీర్చుకోవడానికి ఏం చేశాడు. ఊరి ప్రజలు తమను గౌరవంగా చూడాలనే అజయన్ తల్లి (రోహిణి) కోరిక నెరవేరిందా? లేదా? ఆ ఊరి ఉత్సవాలను డాక్యుమెంటరీగా చేయడానికి సుదేవ్ వర్మ (హరీష్ ఉత్తమన్) ఎందుకు వచ్చాడు? అతని రాకకు కారణమేంటి? అన్నది కథ. 'ఏఆర్ఎమ్' (అజయంతే రంధం మోషణమ్).. కేలు, మణియన్, అజయన్ ఇలా మూడు తరాలకు లింక్ చేస్తూ తీసిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఇది. కింజ కేలు అనే యోధుడు తను ఉన్న రాజ్యం పరువును నిలబెట్టినందుకు ఆ రాజ్యపు రాజు ఏం కావాలో కోరుకోమనగా, ఎన్నో ఏళ్ల చరిత్ర గత శ్రీభూతి దీపాన్ని తన గ్రామంలో చూడాలని, ఆ గ్రామస్తులంతా ఆ దీపాన్ని దర్శించుకుని పూజించాలని, తన కోరిక మేరకు ఆ విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వాలని ఎడక్కల్ మహారాజును కోరడం ఆ విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వడంతో సినిమా మొదలవుతుంది. అక్కడి నుంచి ఆ విగ్రహానికి ఉన్న ప్రాముఖ్యత ఏంటి అన్న దానిపై కథ నడుస్తుంది. కథ ప్రారంభం సింపుల్‌గా ఉంటుంది. కథ ప్రారంభంలోనే కేలు పాత్ర మరణిస్తుంది. అక్కడి నుంచి తర్వాతి తరమైన మణియన్, అజయన్ మీద కథ నడుస్తోంది. అసలు ఆ విగ్రహాన్ని అతను ఎందుకు దొంగతనం చేశాడు అన్న అంశాలను ఆసక్తికరంగా చూపించారు. కథలో భాగంగా కుల వివక్ష, ఆ రోజుల్లోనే దేవాలయాల్లోకి తక్కువ కులస్తులకు ప్రవేశం లేదన్న అం?శాన్ని ఈ చిత్రంలో చెప్పారు. దేవాలయంలో ఉన్నది నకిలీ విగ్రహమని తెలుసుకున్న అజయన్ ఒరిజినల్ విగ్రహం కోసం చేసిన హంట్ బావుంది. అయితే హంటింగ్ సన్నివేశాలన్నీ బావున్నప్పటికీ తెలుగులో వచ్చిన 'సాహసం' చిత్రాన్ని పోలి ఉన్నాయి. మణియన్, తన మనవడు అజయన్... ఇద్దరికీ సమాజం నుంచి ఒకే రకమైన అనుభవాల్ని ఎదుర్కోవడం ఆ రెండు పాత్రల్ని ఒకే ప్రాంతానికి తీసుకొచ్చే సన్నివేశాల్లో రేకెత్తే సంఘర్షణ హత్తుకుంటుంది. ఆ సన్నివేశాల్లో రోహిణి పలికించిన ఎమోషన్స్ అద్భుతమనే చెప్పాలి. గ్రామంలో ఓ కుటుంబాన్ని తక్కువ చేసి పరువు తీశారు అంటే ఆ పరువును తెచ్చుకోవడం కూడా బలంగా ఉండాలి. క్లైమాక్స్‌లో ఒరిజినల్ విగ్రహాన్ని అవమానానికి గురైన అజయన్ తల్లి తీసుకొచ్చి గుడిలో అప్పగించే సన్నివేశాలు తేలిపోయాయి. ఆ సమయంలో బలమైన సంభాషణలు కూడా రాయలేదు. స్క్రీన్‌ప్లే విషయంలో మాత్రం దర్శకుడి ప్రతిభ కనిపించింది. కథ స్లో అవుతున్న ప్రతిసారీ మణియన్ పాత్రను తెరపైకి తీసుకొచ్చి గూస్‌బంప్స్ వచ్చేలా చేశారు. ఇక నటీనటుల విషయానికొస్తే మూడు తరాల్లో కేలు, మణియన్, అజయన్‌గా టొవిన్ థామస్ వన్‌మెన్ షోలా విజృంభించాడు. పాత్రకు తగ్గట్టు తనను తాను మలచుకున్నాడు. మూడు పాత్రల్లో వేరియేషన్స్ బావున్నాయి. సినిమా ప్రారంభంలో కేలుగా టోవినో యుద్ధరంగంలో విన్యాసాలు ఆకట్టుకుంటాయి. మూడు పాత్రల్లోనూ మణియన్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలిచింది. లక్ష్మీగా కృతి శెట్టి అందంగా కనిపించారు. చోటి పాత్రలో ఐశ్వర్య రాజేశ్ క్షణాలే కనిపించినా ఆకట్టుకుంది. మాణిక్యంగా సురభి లక్ష్మి నటన బావుంది. అజయన్ తల్లిగా రోహిణి నటన పర్ఫెక్ట్ యాప్ట్ అయింది. సురేష్‌గా బసిల్ జోసెఫ్ క్యారెక్టర్ నవ్విస్తుంది. హరీష్ ఉత్తమన్, మిగతా నటీనటుల పాత్ర ఫర్వాలేదనిపించింది. సాంకేతిక నిపుణుల విషయానికొస్తే.. ఈ చిత్రానికి బలం సంగీతం. దిబు నినన్ థామస్ సంగీతం, ఆర్‌ఆర్ ఆకట్టుకుంది. జోమోన్ టి జాన్ కెమెరా వర్క్ మెయిన్ ఎసెట్. రాత్రి సన్నివేశాల్లో కూడా బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చాడు. అడిలో ఏరియల్ షాట్స్ బావున్నాయి. సినిమా కలర్ థీమ్. లైటింగ్ పర్ఫెక్ట్‌గా యాప్ట్ అయ్యాయి. తెలుగు అనువాదం విషయంలో టైటిళ్లు, సైన్ బోర్డ్‌ల విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకోవలసింది. దర్శకుడికిది తొలి చిత్రమే అయినా మూడు తరాలు, మూడు పాత్రలను బాగా బ్యాలెన్స్ చేశాడు. ఊహకు అందేలా కథనం ఉండటం కాస్తమైనస్ అనుకోవచ్చు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు

# తప్పు చేశానని ప్రూవ్ చేస్తే దేనికైనా రెడీ..



చిత్రపురి కాలనీ కమిటీ పైన సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ నేతృత్వంలో సైబరాబాద్ డీసీపీ మూడు ఎఫ్‌ఐఆర్లు నమోదు చేసిన విషయం తెలిసిందే. చిత్రపురి కాలనీ కమిటిలోని మొత్తం 21 మంది పైన నాన్ బెయిలబుల్ సెక్షన్ 120 నమోదు కాగా.. ఇందులో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేరు కూడా ఉండటం చర్చనీయాంశం అయింది. తాజాగా దీనిపై తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. ఇంతవరకు చిత్రపురి కాలనీ వివాదంపై తనను ఎవరు సంప్రదించలేదని, పదేళ్ళ క్రితమే తాను ఆ కమిటీ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఒక నాలుగైదు నెలలుగా దీనిపై ఏదో జరుగుతుంది. ఇందుకు ముందు 51 ఎంక్వైరీ, 61 ఎంక్వైరీ అని రెండు ఎంక్వైరీలు వచ్చాయి. అందులో కూడా నా పేరు ఉంది. ఆ తర్వాత పోలీస్ కేసు అని ఏదో హడావుడి చేశారు. అసలేం జరుగుతుందనేది నాకయితే తెలియదు. ఇక్కడ ఎవరినైనా అనుమానించవచ్చు. గొప్ప, చిన్న అనే తేడాలేం లేవ్. కానీ నేను తప్పుచేశాననే అనుమానం ఉన్నప్పుడు నన్ను మాట్లాడనివ్వాలి కదా. గతంలో ఎంక్వైరీలు జరిగినప్పుడు మమ్మల్ని ఏమీ అడగలేదు. రిపోర్ట్ ఇచ్చినప్పుడు మాత్రం అన్నారు. రిపోర్ట్‌లో ఏం ఉందంటే.. 2010కి ముందు నేను సెక్రటరీగా ఉన్నా. అప్పుడు కమిటీ భోగస్ కమిటీ అని, శాంక్షన్ చేసిన భూమిని కూడా వెనక్కి తీసుకోవాలని చూస్తే.. అప్పుడు ఉన్న ప్రభుత్వంతో కొట్లాడి రిజిస్ట్రేషన్ చేయించాం. ఆ తర్వాత నేను కమిటీలో ఉన్నాను కానీ.. ఎటువంటి పదవి తీసుకోలేదు. 2015 వరకు కమిటీలోనే ఉన్నా. 2015 తర్వాత నేను కమిటీలో లేను. నేను దిగిపోయే నాటికి 2000 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు అప్పగించడం జరిగింది. అప్పుడు ఐవిఆర్‌సిఎల్ నుంచి రూ. 30 కోట్లు రికవరీ చేయడం కూడా జరిగింది. 2015 తర్వాత నేను లేను. అలాంటిది నేను ఎలా బాధ్యుడిని అవుతాను.

# 'దేవర' ముంచుతాడా.. మురిపిస్తాడా.. ఈ లెక్కలేంటి



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమా మొదటి భాగం సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో ఎన్టీఆర్ ఇమేజ్‌పై ఒకటే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఎన్టీఆర్ నుంచి సోలోగా సుమారు 6 సంవత్సరాల తర్వాత వస్తున్న ఈ సినిమా బిజినెస్ విషయంలో అందరినీ కన్ఫ్యూజ్ చేస్తోంది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ మార్కెట్ ఎంత అనేది క్లారిటీగా చెప్పలేని పరిస్థితి. ఎన్టీఆర్ చివరగా సోలో హీరోగా నటించిన 'అరవింద సమేత' బిజినెస్‌కు తగ్గ షేర్‌ను కూడా రాబట్టలేకపోయిందనే ప్రచారం ఉంది. ఇక 'ఆర్.ఆర్.ఆర్'తో పాన్ ఇండియా హీరోగా ఎన్టీఆర్‌కు ఇమేజ్ వచ్చినా.. ఆ సినిమా సక్సెస్ క్రెడిట్ మాత్రం ఎక్కువగా రాజమౌళి ఖాతాలోకే పోయింది. ఈ క్రమంలో 'దేవర'తో సోలో హీరోగా ఎన్టీఆర్ మార్కెట్ ఎంత అనేది తేలాల్సి ఉంది. అయితే 'దేవర' విషయంలో మాత్రం ఓవర్సీస్‌లో ప్రీ సేల్స్‌ను చూపించి సినిమా విడుదలకు ముందు హైప్ పెంచే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా టాక్ వినబడుతుండటం విశేషం. మొదటి నుంచి 'దేవర పార్ట్ వన్'కు హైప్ క్రియేట్ అయితే బిజినెస్ భారీగా అయిపోతుందని మేకర్స్ భావించారు. కానీ సినిమా హక్కులను కొనేందుకు పెద్దగా ఎవరు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. చివరికి నిర్మాత నాగవంశీ దేవర హక్కులు పోటీపడి తీసుకున్నాడంటూ.. అది కూడా కనీవినీ ఎరుగని రేట్‌కు అంటూ ప్రచారాలు జరిగాయి. వాస్తవానికి 'దేవర' మేకర్స్ భారీ రేట్లు చెప్పగా.. కొనేందుకు ఒక్కరు కూడా ముందుకు రాకపోవటంతోనే.. నిర్మాత నాగవంశీ చేత ఈ సినిమా హక్కులు కొనుగోలు చేయించినట్లుగా ఇండస్ట్రీ టాక్. తెలుగు రాష్ట్రాల హక్కులను నాగవంశీ రూ. 175 కోట్లతో కొన్నాడని 'దేవర' టీమ్ ఓ వైపు ప్రచారం చేయించుకుంటూ ఉన్నారు. ఒకవేళ అదే కనుక నిజమైతే.. దేవర రూ. 350 కోట్ల గ్రాస్‌ను రెండు తెలుగు రాష్ట్రాలలో అందుకోవాల్సి ఉంటుంది. ఎంతో హైప్, క్రేజ్ ఉన్న సినిమాలకే ఇది సాధ్యం కాని పరిస్థితి. పైగా ఎన్టీఆర్ సినిమాను ఎగబడి చూసేంత ఆసక్తి ఏపీలో అయితే కనిపించటం లేదు. జూనియర్ ఎన్టీఆర్ తన స్నేహితుల కోసం కుటుంబాన్ని, సొంత పార్టీని దూరంగా పెడుతూ వస్తున్నాడనే వార్తలు గత సంవత్సర కాలంగా వినిపిస్తూనే ఉన్నాయి. అది 'దేవర' ఓపెనింగ్స్‌పై ఖచ్చితంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకవేళ సినిమా హిట్ అయితే.. ఎవరు ఆపలేరనుకోవడానికి.. సినిమా ట్రైలర్ వచ్చాక 'దేవర'పై అభిమానులకు ఉన్న కొద్దిపాటి హోప్స్ కూడా పోయాయి. మరి నిర్మాత నాగవంశీ పరిస్థితి ఏంటో అనేలా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. అలాగే బాలీవుడ్‌లో 'దేవర' డిస్ట్రిబ్యూషన్‌ను తీసుకోవటానికి ఆసక్తి చూపని క్రమంలో కరణ్ జోహార్ చేతిలో పెట్టేశారనేలా టాక్ నడుస్తుంది. అలాగే శాటిలైట్ హక్కుల విషయంలో కూడా ఇంకా క్లారిటీ లేదు. ఇలా విడుదలకు ముందే బిజినెస్ పరంగా 'దేవర'పై ఎక్కడాలేని నెగిటివిటీ నడుస్తోంది. మరి ఈ నెగిటివిటీకి ఆ 'దేవర' ఎలా సమాధానమిస్తాడో తెలియాలంటే మాత్రం సెప్టెంబర్ 27 వరకు వెయిట్ చేయాల్సిందే.

# చీరలో భాగ్యశ్రీ అందం.. రెండు కళ్ళు సరిపోవేమో..



భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్ లో తన అందంతో, గ్లామర్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమా మిస్టర్ బచ్చన్ లోనే అదిరిపోయే నటనతో అందరి మనసులను గెలుచుకుంది. ఆ మూవీ ఫెయిల్యూర్ అయినప్పటికీ, ఆమె అందం, గ్లామర్, డ్యాన్సింగ్ టాలెంట్ వల్ల ప్రేక్షకులు ఆమెపై చూపు నిలిపారు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో గ్లామరస్ ఫోటోలతో అభిమానులు బాగా పెరుగుతున్నారు. ఇటీవల భాగ్యశ్రీ బోర్సే పంచుకున్న కొన్ని ఫోటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. వైట్ సారీలో అందంగా కనిపించిన ఈ ఫోటోలో ఆమె అద్భుతమైన ఫాషన్ సెన్స్ ను ప్రదర్శించింది. భాగ్యశ్రీ ప్రస్తుతం టాలీవుడ్ లో మరో ఛాన్స్ కొట్టేసింది. విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న సినిమాలో భాగ్యశ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోంది. విజయ్ దేవరకొండతో కలిసి నటించే ఈ అవకాశం ఆమె కెరీర్ కి మేజర్ టర్నింగ్ పాయింట్ అవుతుందని అనిపిస్తోంది. ఇదిలా ఉంటే, భాగ్యశ్రీ తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్ లో కూడా నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో కాంత అనే సినిమా తెరకెక్కుతోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పీరియాడిక్ నేపథ్యంలో 1950 ల మద్రాస్ లో కథా నేపథ్యం తో ఉంటుంది. ఈ సినిమాలో భాగ్యశ్రీ కీలక పాత్ర పోషిస్తోంది. రానా దగ్గుబాటి కూడా ఈ సినిమాలో ఒక ప్రధాన పాత్రతో పాటు, నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ మల్టీ లింగ్వల్ గా తెరకెక్కబోతోంది. భాగ్యశ్రీ బోర్సే ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటూ, తన గ్లామర్ పిక్స్ తో ఫాలోవర్స్ ని మరింతగా ఆకర్షిస్తోంది. ఇక కాంత సినిమా స్టార్ట్ అయిన సందర్భంగా ఆమె ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటోకి మంచి స్పందన వచ్చింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ తో భాగ్యశ్రీ కెరీర్ మరింత ఊపందుకోవడం ఖాయం అంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.

# మీనాక్షి చౌదరి.. గ్లామరస్ లుక్ లో నువ్వే నెంబర్ వన్



అందం, అభినయం కలబోసిన నటి మీనాక్షి చౌదరి, టాలీవుడ్‌లో ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకుంటోంది. ఫ్యాషన్ ఫోటోషూట్లలో కుర్రకారును కట్టిపడేస్తున్న ఈ సుందరి, ఇటీవల వైట్ అవుట్‌ఫిట్‌లో ఉన్న ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. సింపుల్ స్టైల్‌లోనే మీనాక్షి కనిపించినా, ఆమె లుక్ ని చూసిన ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ ఫోటోలకు సోషల్ మీడియాలో భారీ స్పందన వచ్చింది. మోడల్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన మీనాక్షి, ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ బిజీగా సినిమాలు చేస్తోంది. ''ఇచ్చట వాహనములు నిలుపరాదు" తో తెరంగేట్రం చేసిన ఆమె, "ఖిలాడి", "హిట్ 2" వంటి చిత్రాల్లో నటించి, తన ప్రతిభను చూపించింది. రాబోయే రోజుల్లో క్రేజీ సినిమాల్లో కనిపించనుంది. టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లో కూడా మీనాక్షి బిజీ కావాలని అనుకుంటోంది. ఇటీవల "విజయ్ సినిమాలో స్పెషల్ పాత్రలో ఈ బ్యూటీ, కోలీవుడ్‌లోను అదృష్టాన్ని పరీక్షించుకుంది. కానీ ఆ సినిమా అంతగా సక్సెస్ కాలేదు. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా కూడా అమ్మడి క్రేజ్ మాత్రం మాములుగా లేదు. ఇక రీసెంట్ షేర్ చేసిన ఫోటోలకు లక్షల సంఖ్యలో లైకులు, కామెంట్లు రావడం గమనార్హం. మీనాక్షి లుక్ పై పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. అలాగే బ్యూటీఫుల్ క్వీన్ అంటూ కొనియాడుతున్నారు. ఈ లుక్‌లో ఆమె ప్రొఫెషనల్ మోడల్ ఫీల్ ఇస్తూ అభిమానులను ఆకట్టుకుంది. సమకాలీన నటీమణులలో తనకంటూ ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకుంటున్న మీనాక్షి, రాబోయే రోజుల్లో మరింత పోటీని ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మెకానిక్ రాకీ, విశ్వంభర, లక్కీ భాస్కర్, మట్కా.. సినిమాలతో అమ్మడు చాలా బిజీగా ఉంది. ఇందులో ఏ ఒక్కటి సక్సెస్ అయినా కూడా ఆమె స్థాయి మరో లెవెల్ కు వెళుతుంది.

# హీరో జయం రవి విడాకుల ప్రకటన.. అతడి భార్య ఆర్తి సంచలన ఆరోపణ



కోలీవుడ్ స్టార్ హీరో జయం రవి తన భార్య ఆర్తితో విడాకులు తీసుకుంటున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ విషయంపై ఆయన భార్య ఆర్తి సంచలన ఆరోపణలు చేశారు. తనకు తెలియకుండానే విడాకుల ప్రకటన చేశారని అన్నారు. రవి చేసిన ప్రకటన చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో.. నా అనుమతి లేకుండా, నాకు తెలియకుండానే విడాకుల గురించి బహిరంగంగా ప్రకటించారు. దీన్ని చూసి దిగ్భ్రాంతికి గురి అయ్యాను అని ఆర్తి తెలిపింది. ఎంతో భాధపడినట్లుగా చెప్పుకొచ్చింది. 18 ఏళ్ళుగా కలిసి జీవించామని, ఇంతటి ముఖ్యమైన విషయాన్ని తనకు చెప్పకుండా ప్రకటించడం బాధించిందని తెలిపింది. తమ మధ్య విభేదాలు ఉన్నాయని, అయితే వాటిని పరిష్కరించుకునేందుకు ఎంతో ప్రయత్నించానని అంది. తన భర్తతో నేరుగా మాట్లాడే అవకాశం కోసం ఇప్పటికి ప్రయత్నిస్తూనే ఉన్నట్లుగా తెలిపింది. అయితే.. దురదృష్టవశాత్తు తనకు ఆ అవకాశం దక్కలేదంది. విడాకుల ప్రకటనతో తనతో పాటు తన పిల్లలు కూడా షాక్ అయ్యారని తెలిపారు. ఇది పూర్తిగా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం అని తెలిపారు. బాధ కలిగినప్పటికీ తాను గౌరవంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. అందుకనే పబ్లిక్‌గా ఎలాంటి కామెంట్లు చేయడం లేదన్నారు. అన్యాయంగా తనపై నిందలు వేసి, తనను తప్పుగా చూపిస్తున్న వార్తలు భరించడం కష్టంగా ఉందన్నారు. ఓ తల్లిగా తన మొదటి ప్రాధాన్యత తన పిల్లల శ్రేయస్సేనని చెప్పుకొచ్చారు. వారిపై ఈ వార్త ప్రభావాన్ని చూపుతుందనే విషయం తనకు బాధ కలిగిస్తోందన్నారు. కాలం అన్నింటికి సమాధానం చెబుతుందని తాను నమ్ముతున్నట్లుగా భావిస్తున్నానని చెప్పింది. ఇక ఇన్నాళ్లుగా మద్దతు ఇచ్చిన మీడియా, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులోనూ మా గోపత్యకు ఎలాంటి భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లుగా ఆర్తి ఆ లేఖలో పేర్కొంది.

